




Truth of News RNI NO : APTEL/25/A0239

# సూర్య వాస్తవం

http://www.suryavastavam.in

చీఫ్ ఎడిటర్ : మొఘల్ ఇర్షాద్ బేగ్



IRS PUBLICATIONS
irspublications12@gmail.com




సంపుటి: 01 | చిత్తూరు | సంచిక : 71 | శుక్రవారం 08 ఆగస్టు 2025 | పేజీలు : 9 | వెల రూ.6.50

Circulated from Hyderabad, Vishakapatnam, Rajahmundry, Vijayawada, Guntur, Nellore, Tirupati, Anantapuram, kadapa, kurnool, Warangal, Karimnagar, Nalgonda, Chennai, Bengalore, Mumbai, New Delhi


### ట్రంప్ చర్యలతో

# రూ.3.75 లక్షల కోట్ల భారం

**- మోడీ సర్కార్ మౌనంపై ప్రతిపక్షాల నిలదీత - ఎస్ఐఆర్, సుంకాలపై దద్దరిల్లిన పార్లమెంట్**



న్యూఢిల్లీ – సూర్య వాస్తవం, ఆగస్టు 07

బీహార్‌లో ఓటర్ల జాబితా స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (ఎస్ఐఆర్), అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ సుంకాల బాదుడుపై పార్లమెంట్ దద్దరిల్లింది. కేంద్రం తీరును నిరసిస్తూ పార్లమెంట్ లోపల, బయట ప్రతిపక్షాలు ఆందోళన చేపట్టాయి. లోక్‌సభలో ప్రతిపక్షాల ఆందోళనల మధ్యే మణిపూర్‌కు సంబంధించిన రెండు బడ్జెట్ బిల్లులను ఎటువంటి చర్చ లేకుండా మూజువాణి ఓటుతో ఆమోదించారు. రాజ్యసభలో కోస్టల్ షిప్పింగ్ బిల్లును ఆమోదించారు. గురువారం లోక్‌సభ ప్రారంభం కాగానే స్పీకర్ ఓం బిర్లా ప్రశ్నోత్తరాలు నిర్వహించేందుకు ప్రయత్నించారు. ప్రతిపక్ష ఎంపిలు వెల్‌లోకి దూసుకెళ్లి, ప్లకార్డులు పట్టుకుని ఎస్ఐఆర్‌పై చర్చించాలని నినాదాలు చేశారు. వెంటనే సభను స్పీకర్ మధ్యాహ్నం 12 గంటలకు వాయిదా వేశారు. తిరిగి ప్రారంభమైనప్పుడు కూడా ప్రతిపక్షాల ఆందోళన కొనసాగడంతో సభను మధ్యాహ్నం 2 గంటలకు వాయిదా వేశారు. తిరిగి ప్రారంభమైన సభలో ప్రతిపక్షాల ఆందోళన కొనసాగుతుండగానే, ఎటువంటి చర్చ లేకుండా మణిపూర్ ఆర్థిక వ్యవహారాలు, బడ్జెట్‌కు సంబంధిం చిన రెండు బిల్లులను మూజువాణి ఓటుతో ఆమోదించారు. అనంతరం సభను శుక్రవారానికి వాయిదా వేశారు. ఇటు రాజ్యసభలోనే ప్రతిపక్షాల ఆందోళన కొనసాగింది. దీంతో సభ తొలుత మధ్యాహ్నం 2 గంటలకు వాయిదా పడింది. తిరిగి ప్రారంభమైన సభలోనూ కోస్టల్ షిప్పింగ్ బిల్లుపై చర్చ జరిగింది. అనంతరం బిల్లును ఆమోదించారు.

**పార్లమెంట్ ఆవరణలో ప్రతిపక్షాల ఆందోళన**

గురువారం పార్లమెంట్ ఆవరణలో బీహార్‌లో ఓటర్ల జాబితా సవరణ (ఎస్ఐఆర్)కి వ్యతిరేకంగా ప్రతిపక్షాలు ఆందోళన చేపట్టాయి. ప్రతిపక్ష ఎంపిలు ప్లకార్డులు చేత పట్టుకుని

- మిగతా 2లో..



## విశాఖలో పేలిన గ్యాస్ సిలిండర్

**- ముగ్గురు మృతి**
**- మరో ముగ్గురికి తీవ్ర గాయాలు**
**- ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న క్షతగాత్రులు**

విశాఖపట్నం– సూర్య వాస్తవం, ఆగస్టు 7

విశాఖలో ఆక్సిజన్ గ్యాస్ సిలిండర్ పేలి ముగ్గురు మరణించారు. మరో ముగ్గురు తీవ్రంగా గాయపడ్డారు. వీరిలో ఒకరి పరిస్థితి విషమంగా ఉంది. పేలుడు ధాటికి వెల్డింగ్ షాపులోని వస్తువులు చెల్లాచెదురయ్యాయి.

8లో

### ఒకే నియోజకవర్గంలో

# లక్ష దొంగ ఓట్లు

**- ఐదు నెలల కాలంలో కోటి ఓట్ల నమోదు**
**- మీడియా సమావేశంలో రాహుల్ పవర్‌పాయింట్ ప్రజెంటేషన్**
**- బిజెపితో ఎన్నికల కమిషన్ కుమ్మక్కైందని విమర్శ**
**- న్యాయవ్యవస్థ జోక్యం చేసుకోవాలని విజ్ఞప్తి**

న్యూఢిల్లీ – సూర్య వాస్తవం, ఆగస్టు 07



తమపై చేస్తున్న ఆరోపణలకు ఆధారాలు చూపాలని ఎన్నికల కమిషన్ డిమాండ్ చేస్తున్న నేపథ్యంలో కాంగ్రెస్ నేత, లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ గురువారం నాడు పలు కీలక అంశాలను వెల్లడించారు. ఎఐసిసి ప్రధాన కార్యాలయం (ఇందిరా భవన్)లో నిర్వహించిన మీడియా సమావేశంలో ఇటీవల ఎన్నికలు జరిగిన రాష్ట్రాల్లో చోటుచేసుకున్న అవకతవకలపై పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ చేశారు.

- మిగతా 2లో..

### రైతు ప్రయోజనాలపై

# రాజీపడేది లేదు

**- ట్రంప్, టారిఫ్‌ల పేరెత్తని ప్రధాని మోడీ**

న్యూఢిల్లీ – సూర్య వాస్తవం, ఆగస్టు 07



దేశ రైతు ప్రయోజనాల విషయంలో భారత్ ఎప్పుడూ రాజీ పడదని ప్రధానమంత్రి నరేంద్ర మోడీ స్పష్టం చేశారు. రైతు సంక్షేమమే తమ ప్రభుత్వానికి అత్యంత ప్రాధాన్యత అని తెలిపారు. అమెరికా గతంలో విధించిన 25 శాతం సుంకాలకు అదనంగా మరో 25 శాతం సుంకాలు తాజాగా ట్రంప్ విధించడంతో రైతులు, అమెరికాకు ఎగుమతి చేస్తున్న వారిలో పెద్ద ఎత్తున ఆందోళన వ్యక్తమ వు తోంది. అమెరికాతో ప్రతిపాదిత స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందంపై, ట్రంప్ తాజా ప్రకటనలపై

2లో - మిగతా 2లో..



## స్థానిక 'ఉప' పోరుకు రక్షణ చర్యలు తీసుకోండి

**- ఎన్నికల సంఘానికి హైకోర్టు ఆదేశం**

అమరావతి– సూర్య వాస్తవం, ఆగస్టు 07

స్థానిక సంస్థల ఉప ఎన్నికల నిర్వహణలో భాగంగా శాంతిభద్రతల రక్షణకు చర్యలు తీసుకోవాలని రాష్ట్ర ఎన్నికల సంఘాన్ని (ఎస్ఇసి) హైకోర్టు ఆదేశించింది. ఉప ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థులకు పోలీసు భద్రత కల్పించడంతో పాటు,

2

# ఎర్రవల్లే కేసీఆర్‌కు చర్లపల్లి

**- ప్రత్యేకంగా మేం జైల్లో పెట్టక్కర్లేదు**
**- ములాఖత్‌కు వెళ్లినట్టే నేతలు ఫాంహౌజ్‌కు వెళ్లొస్తున్నారు**
**- కేసీఆర్ ఆరోగ్య రహస్యం తెలీదు**
**- కొడంగల్‌లో 15 వేల ఓట్లు తీసేయడంతో ఓడిపోయా**
**- బీసీ రిజర్వేషన్లపై ప్రధాని అపాయింట్‌మెంట్ కోరినా ఇవ్వలేదు**
**- '42 శాతం'పై త్వరలో బీసీ సంఘాలు, భాగస్వాములతో భేటీ**
**- స్థానిక ఎన్నికలు ఆపడం వల్ల రాష్ట్రానికే నష్టం**
**- ఢిల్లీలో మీడియాతో ఇష్టాగోష్టిలో సీఎం రేవంత్‌రెడ్డి**



న్యూఢిల్లీ – సూర్య వాస్తవం, ఆగస్టు 07

"ఎర్రవెల్లి ఫాంహౌసే మాజీ సీఎం కేసీఆర్‌కు చర్లపల్లి జైలు. ఆయన్ని మేం ప్రత్యేకంగా జైలులో పెట్టాల్సిన పనిలేదు. చర్లపల్లి సెంట్రల్ జైలు బయటా పోలీసులు కాపలా ఉంటారు. ఎర్రవెల్లి ఫాంహౌస్ బయటా పోలీసులు ఉంటారు. జైల్లో ఖైదీలతో ములాఖాత్‌కు వెళ్లినట్టే, అప్పుడప్పుడు

- మిగతా 2లో..

### ఒక్కో చేనేత కుటుంబానికి

# ఏడాదికి రూ.25 వేలు

**- నేత మగ్గాలకు 200 యూనిట్లు, మరమగ్గాలకు 500 యూనిట్ల ఉచిత విద్యుత్**
**- అమరావతిలో చేనేత మ్యూజియం, ఐదు చోట్ల క్లస్టర్లు**
**- జాతీయ చేనేత దినోత్సవంలో ముఖ్యమంత్రి చంద్రబాబు**

మంగళగిరి – సూర్య వాస్తవం, ఆగస్టు 07



చేనేత కళాకారుల ఆదాయాన్ని రెట్టింపు చేస్తామని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అన్నారు. నేతన్న భరోసా పథకం కింద ఏడాదికి ఒక్కో చేనేత కుటుంబానికి రూ.25 వేల చొప్పున ఆర్థిక సాయం అందిస్తామని ప్రకటించారు. గుంటూరు జిల్లా మంగళగిరిలో గురువారం నిర్వహించిన 11వ జాతీయ చేనేత దినోత్సవానికి ఆయన హాజరయ్యారు. మంత్రి నారా లోకేష్ సహకారంతో గతంలో ఏర్పాటైన వీవర్‌శాలను సందర్శించి అక్కడ చేనేత కళాకారులతో కాసేపు మాట్లాడారు. ఉత్పత్తులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన ప్రజావేదిక సభలో చంద్రబాబు మాట్లాడుతూ చేనేత మగ్గాలకు 200 యూనిట్లు, మరమగ్గాలకు 500 యూనిట్ల ఉచిత విద్యుత్తును ఈ నెల నుండే అందిస్తామని ప్రకటించారు. రాష్ట్రంలో చేనేత మగ్గాలు ఉన్న 93 వేల కుటుంబాలకు, పవర్ లూమ్స్ ఉన్న 50 వేల కుటుంబాలకు ఉచిత విద్యుత్ పథకం ద్వారా లబ్ధి చేకూరుతుందని వివరించారు. ఇందుకోసం ఏడాదికి రూ.190 కోట్లు ఖర్చవుతుందని తెలిపారు. రాష్ట్రంలోని మాస్టర్ వీవర్లు, కళాకారులు ఉత్పత్తుల్లో రూ.1,375 కోట్ల టర్నోవర్ సాధించారన్నారు. అమరావతిలో హ్యాండ్లూమ్ మ్యూజియం ఏర్పాటు చేస్తామని ప్రకటించారు. చేనేత పరిశ్రమను ముందుకు తీసుకెళ్లాలనే తపన ఉన్న పారిశ్రామికవేత్త సుచిత్రా ఎల్లాను సలహాదారుగా పెట్టుకున్నామని, వన్ ప్రొడక్ట్, వన్ డిస్ట్రిక్ట్ కింద రాష్ట్రానికి వచ్చిన తొమ్మిది అవార్డుల్లో నాలుగు చేనేత రంగానికే వచ్చాయని తెలిపారు. వన్ ప్రొడక్ట్, వన్ డిస్ట్రిక్ట్ ద్వారా ఉత్పత్తుల మార్కెట్ విస్తరిస్తున్నామని, ఇప్పటికే రెండు వేల చేనేత ఉత్పత్తులు ఇందులో నమోదయ్యాయని తెలిపారు. చేనేతకు చేయూత ఇచ్చేందుకు నేషనల్ రూరల్ లైవ్లీ హుడ్ మిషన్ కింద మంగళగిరి, వెంకటగిరి, ఉప్పాడ, శ్రీకాళహస్తి, రాజాంలో రూ.74 కోట్లతో కొత్త హ్యాండ్లూమ్ క్లస్టర్లను ప్రారంభిస్తున్నామని, వీటిద్వారా 11,374 మంది చేనేత మహిళలకు లబ్ధి

- మిగతా 3లో..

## యువత వారానికి ఒక్కసారైనా చేనేత వస్త్రాలు ధరించాలి



**- నేతన్నలకు శుభాకాంక్షలు తెలిపిన పవన్**
**- చేనేత మగ్గాలకు 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్**
**- మరమగ్గాలకు 500 యూనిట్ల దాకా కరెంట్ ఫ్రీ - ఆప్కో కొనుగోళ్లపై 5 శాతం జీఎస్టీ రాయితీ - నేతన్నల కోసం త్రిఫ్ట్ ఫండ్ ఏర్పాటుకు నిర్ణయం - చేనేతకు అన్ని విధాలా అండగా ఉంటామని హామీ**

2


సూర్య వాస్తవం దినపత్రికలోని మరిన్ని వార్తల కోసం సంప్రదించండి


## సబ్సిడీపై నూలును అందించాలి

**- పిసిసి చీఫ్ షర్మిలం**

అమరావతి – సూర్య వాస్తవం, ఆగస్టు 07



నేతన్నలకు నూలును సబ్సిడీపై అందించాలని పిసిసి చీఫ్ వై.ఎస్ షర్మిల ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. చేనేత వస్త్రాలపై 5 శాతం జిఎస్‌టి విధించి కేంద్రం వెన్నుపోటు పొడిస్తే, ప్రతి మగ్గానికి 200 యూనిట్ల ఉచిత విద్యుత్ ఇచ్చామని హామీ ఇచ్చి ఇప్పుడు సగానికి కొత్త పెట్టి చంద్రబాబు తీరని అన్యాయం చేశారని గురువారం

- మిగతా 2లో..

## రైతు ప్రయోజనాలపై
# రాజీపడేది లేదు

(మొదటిపేజీ తరువాయి)

ప్రధాని నేరుగా స్పందించకపోవడం గమనార్హం. న్యూఢిల్లీలో ఎంఎస్ స్వామినాథన్ సెంటెనరీ ఇంటర్నేషనల్ కాన్ఫరెన్స్ 2025ను ప్రధాని గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు, పశువుల పెంపకందారులు, మత్స్యకారుల ప్రయోజనాలతో భారతదేశం రాజీపడదని చెప్పారు. 'ఇలాంటి వైఖరి తీసుకున్నందుకు నేను వ్యక్తిగతంగా భారీ మూల్యం చెల్లించుకోవాల్సి వస్తుందని నాకు తెలుసు. కానీ దీనికి సిద్ధంగా ఉన్నాను' అని మోడీ చెప్పారు. రైతుల ఆదాయాన్ని మెరుగుపరచడం, ఇన్‌పుట్ ఖర్చులను తగ్గించడం, కొత్త ఆదాయ వనరులను కనుగొనడానికి కృషి చేస్తున్నామని చెప్పారు. ప్రొఫెసర్ స్వామినాథన్ సేవలను ఒక నిర్దిష్ట కాలానికి లేదా ఒక నిర్దిష్ట భౌగోళిక ప్రాంతానికి పరిమితం చేయలేమని తెలిపారు. ప్రొఫెసర్ స్వామినాథన్ గొప్ప శాస్త్రవేత్త అని, భారతదేశపు ముద్దుబిడ్డ అని ప్రశంసించారు. 'ప్రజలకు సేవ చేయడానికి స్వామినాథన్ సైన్స్‌ను ఒక సాధనంగా ఉపయోగించారు. దేశ ఆహార భద్రత ఆయన జీవిత లక్ష్యం. దేశ విధానాలు, ప్రాధాన్యతలకు ఆయన దార్శనికత మార్గనిర్దేశం చేస్తూనే ఉంటుంది' అని ప్రధానమంత్రి అన్నారు. 'రైతుల జీవితాలను మెరుగుపరచడానికి నిత్య హరిత విప్లవం, బయో గ్రామాలు అనే భావనను అందించారు' అని మోడీ చెప్పారు.

## విశాఖలో పేలిన
# గ్యాస్ సిలిండర్

(మొదటిపేజీ తరువాయి)

ఒక్కసారిగా భారీ శబ్దం రావడంతో చుట్టుపక్కల ప్రజలు ఉలిక్కిపడ్డారు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. నగరంలోని ఫిషింగ్ హార్బర్ నేవల్ క్యాంటీన్‌కు వెళ్లే మార్గంలో హిమాలయ బార్ పక్కన ఉన్న గ్యాస్ వెల్డింగ్ షాపులో గురువారం సాయంత్రం ఆక్సిజన్ సిలిండర్ పేలింది. ఈ ఘటనలో వెల్డింగ్ షాప్ యజమాని చల్లా గణేష్ (45), బుక్కా వీధికి చెందిన శ్రీను (32) అక్కడికక్కడే మరణించారు. బుక్కా వీధికి చెందిన సిహెచ్.ముత్యాలు, మధురవాడ మిథిలాపురి కాలనీకి చెందిన ఎర్ర ఎల్లాజీ , ఆరిలోవ రాజీవ్‌నగర్‌కు చెందిన టి.సన్యాసిరావు, ఎవిఎన్ కాలేజీ సమీపంలోని చెంగళరావుపేటకు చెందిన ఇప్పిలి రంగారావు తీవ్రంగా గాయపడ్డారు. వారిని కెజిహెచ్ కు తరలించారు. ఆస్పత్రిలో చికిత్స పొందుతూ సిహెచ్. ముత్యాలు మరణించారు. అగ్నిమాపక సిబ్బంది, పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని ప్రమాద వివరాలు సేకరించారు. హార్బర్‌లోని బోట్లకు ఇక్కడ వెల్డింగ్ పనులు నిర్వహిస్తున్నట్లు పోలీసులు తెలిపారు. విషయం తెలియగానే ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్, జిల్లా కలెక్టర్ ఎంఎన్.హరేంధిర ప్రసాద్ సంఘటన స్థలానికి చేరుకొని, ప్రమాదం జరిగిన తీరును అడిగి తెలుసుకున్నారు. కెజిహెచ్‌లో చికిత్స పొందుతున్న క్షతగాత్రులను వారితో పాటు నగర పోలీస్ కమిషనర్ శంఖబ్రత బాగ్చి పరామర్శించారు. మృతుల కుటుంబాలకు రూ.50 లక్షలు ఎక్స్‌గ్రేషియో చెల్లించాలని ఎపి మత్స్యకారులు, మత్స్య కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షులు కె.చంద్రశేఖర్ డిమాండ్ చేశారు.

# స్థానిక 'ఉప' పోరుకు రక్షణ చర్యలు తీసుకోండి

(మొదటిపేజీ తరువాయి)

సిసిటివిలు ఏర్పాటు చేసి ఎన్నికల ప్రక్రియను నెట్ క్యాస్టింగ్ చేసేలా రాష్ట్ర ఎన్నికల సంఘానికి ఉత్తర్వులు ఇవ్వాలంటూ వైసిపి ప్రధాన కార్యదర్శి లేళ్ల అప్పిరెడ్డి పిటిషన్ వేశారు. ఎన్నికల ప్రక్రియ పర్యవేక్షణకు స్వతంత్ర పరిశీలకులను నిమించాలని కోరారు. ఈ మేరకు ఎస్ఇసికి వినతిపత్రాలు కూడా సమర్పించామని లాయర్ వడ్లమూడి కిరణ్ కుమార్ గురువారం కోర్టుకు తెలిపారు. దీనికి ఎస్ఇసి న్యాయవాది స్పందిస్తూ పిటిషనర్ వినతిపత్రాన్ని డిజిపికి పంపినట్లు చెప్పారు. ఎన్నికల పర్యవేక్షకులుగా జేసీలు ఉన్నారని తెలిపారు. వాదనలు విన్న జస్టిస్ నిమ్మగడ్డ వెంకటేశ్వర్లు ఎన్నికల ప్రక్రియ మొదలైన తర్వాత కోర్టుల జోక్యం చేసుకునే అవకాశాలు తక్కువగా ఉంటాయని చెప్పారు. శాంతిభద్రతలకు ఇబ్బంది లేకుండా ఎస్ఇసి చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

# యువత వారానికి ఒక్కసారైనా చేనేత వస్త్రాలు ధరించాలి

### - నేతన్నలకు శుభాకాంక్షలు తెలిపిన పవన్

**అమరావతి - సూర్య వాస్తవం, ఆగస్టు 07**

జాతీయ చేనేత దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం నేత కార్మికులకు శుభవార్త చెప్పింది. చేనేత రంగానికి అండగా నిలుస్తూ పలు కీలక నిర్ణయాలు తీసుకున్నట్లు ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ వెల్లడించారు. ఇందులో భాగంగా చేనేత మగ్గాలకు 200 యూనిట్లు, మరమగ్గాలకు 500 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ అందించనున్నట్లు ఆయన ప్రకటించారు. గురువారం జాతీయ చేనేత దినోత్సవం సందర్భంగా పవన్ కల్యాణ్ స్పందిస్తూ, చేనేత కళ మన దేశ సంస్కృతికి, స్వాతంత్ర్య స్ఫూర్తికి ప్రతీక అని కొనియాడారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నేతృత్వంలో జరిగిన కేబినెట్ సమావేశంలో చేనేత రంగానికి లబ్ధి చేకూర్చేలా ఈ నిర్ణయాలు తీసుకున్నట్లు తెలిపారు. ఉచిత విద్యుత్ పథకంతో పాటు, చేనేత సొసైటీల నుంచి ఆప్కో కొనుగోలు చేసే వస్త్రాలపై 5 శాతం జీఎస్టీ రాయితీ ఇవ్వాలని కూడా ప్రభుత్వం నిర్ణయించిందని వివరించారు. దీనితో పాటు, కార్మికులకు ఆర్థిక భరోసా కల్పించేందుకు త్రిఫ్ట్ ఫండ్ ఏర్పాటు చేయనున్నట్లు స్పష్టం చేశారు. కూటమి ప్రభుత్వం చేనేత రంగానికి అన్ని విధాలుగా ఊతమిస్తుందని ఆయన భరోసా ఇచ్చారు. చేనేత వస్త్రాల వాడకాన్ని పెంచేందుకు ప్రత్యేక ప్రచార కార్యక్రమాలు చేపడతామని అన్నారు. రాష్ట్రంలోని యువత వారానికి ఒక్కరోజైనా చేనేత వస్త్రాలు ధరిస్తే, ఆ రంగంపై ఆధారపడిన వారికి ఉపాధి అవకాశాలు మెరుగుపడతాయని పవన్ కల్యాణ్ పిలుపునిచ్చారు. అసంఘటిత రంగాలలో కీలకమైన చేనేతను ఆదుకోవడం ప్రభుత్వ బాధ్యత అని ఆయన పేర్కొన్నారు.

# సబ్సిడీపై నూలును అందించాలి

(మొదటిపేజీ తరువాయి)

ఒక ప్రకటనలో విమర్శించారు. రాష్ట్రంలో 1.70 లక్షల మగ్గాలు ఉంటే కేవలం 62 వేల మగ్గాలకు ఉచిత విద్యుత్ ఇచ్చి చేతులు దులుపుకోవడం దుర్మార్గమన్నారు. గత ఎన్నికల్లో చేనేతలకు ఇచ్చిన 25 హామీలను ప్రభుత్వం బుట్టదాఖలు చేసి, చేనేత సంక్షేమాన్ని విస్మరించిందన్నారు. చేనేతల సంక్షేమానికి 5 వేల కోట్లు బడ్జెట్‌లో కేటాయిస్తామని చెప్పిన ప్రధాని మోడి ముష్టి రూ.200 కోట్లు మాత్రమే ఇవ్వడం దారుణమని తెలిపారు. చేనేతలకు సబ్సిడీ కింద బకాయి పడిన రూ.152 కోట్లు వెంటనే విడుదల చేయాలన్నారు. ప్రతి చేనేతకు హెల్త్ కార్డు అందించాలని, భీమా సౌకర్యాన్ని కల్పించాలని కోరారు.

## ట్రంప్ చర్యలతో
# రూ.3.75 లక్షల కోట్ల భారం

(మొదటిపేజీ తరువాయి)

మోడీ ప్రభుత్వానికి, కేంద్ర ఎన్నికల సంఘానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నేతలు మల్లికార్జున ఖర్గే, సోనియా గాంధీ, ప్రియాంక గాంధీ, సిపిఎం ఎంపి జాన్ బ్రిట్టాస్, వి. శివదాసన్, డిఎంకె ఎంపి కనిమొళి, ఎ.రాజా, ఎస్‌పి ఎంపి సుప్రియా సులే, ఎన్‌సిపి ఎంపి రాంగోపాల్ యాదవ్, ఆర్‌జెడి ఎంపి మనోజ్ కుమార్ ఝా ఇతర ప్రతిపక్ష ఎంపిలు పాల్గొన్నారు. ఎస్ఐఆర్‌ను వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. బిజెపి పాలిత రాష్ట్రాల్లో వలస కూలీలను అరెస్టు చేయడంపై కూడా ప్రతిపక్ష ఎంపిలు ఆగ్రహం వ్యక్తం చేశారు. కేంద్రంలో అధికారంలో ఉన్న బిజెపి.. ఈ విషయంలో తన ముఖ్యమంత్రులను నియంత్రించాలని డిమాండ్ చేశారు.

విదేశాంగ విధానంలో మోడీ ప్రభుత్వం ఫెయిల్ : మల్లికార్జున ఖర్గే

ట్రంప్ 50 శాతం సుంకాలు విధించడం నరేంద్రమోడీ ప్రభుత్వ వైఫల్యమని రాజ్యసభలో ప్రతిపక్ష నేత మల్లికార్జున ఖర్గే విమర్శించారు. భారత దౌత్యం బలహీనంగా, గందరగోళంగా కనిపిస్తున్న నేపథ్యంలో ట్రంప్ ఈ చర్యలు తీసుకున్నారన్నారు. ఆరు నెలలుగా మోడీ ప్రభుత్వం అమెరికాతో ఎలాంటి ఒప్పందం చేసుకోలేకపోయిందని, ట్రంప్ భారత్‌ను బెదిరిస్తూ వస్తున్నా, బలవంతం చేస్తున్నా మోడీ మౌనంగా ఉన్నారని ఆరోపించారు. ట్రంప్ బ్రిక్స్, వందశాతం సుంకాలపై వ్యాఖ్యానించినా ప్రధాని ఏమీ మాట్లాడలేదన్నాన్నారు. అమెరికా సుంకాల విధానంపై, దేశ ఆర్థిక పరిస్థితిపై ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. అమెరికాకు ఇండియా ఎగుమతులు దాదాపు రూ.7.51 లక్షల కోట్లని, 50 శాతం సుంకాలతో దాదాపు రూ.3.75 లక్షల కోట్ల ఆర్థిక భారం పడుతుందని అన్నారు. వ్యవసాయం, ఎంఎస్ఎంఇ, పాడి పరిశ్రమ, ఇంజినీరింగ్, ఎలక్ట్రానిక్స్, రత్నాలు, ఆభరణాలు, ఔషధాలు, పెట్రోలియం, వస్త్ర పరిశ్రమలు ఎక్కువగా ప్రభావితమవుతాయని ఆందోళన వ్యక్తం చేశారు. దేశ దౌత్యం వినాశకరమైన రీతిలో దిగజారిపో తున్న సమయంలో ట్రంప్ 50 శాతం సుంకాలు వచ్చాయని అన్నారు. ఇది విదేశాంగ విధాన విపత్తు అని పేర్కొన్నారు.

దేశం, ఆర్థిక వ్యవస్థ, రైతులు, యువతకు ముప్పు : అఖిలేష్ యాదవ్

విదేశాంగ విధానం అన్ని విధాలా విఫలమైందనడానికి ట్రంప్ 50 శాతం సుంకాలు విధించడమే నిదర్శనమని సమాజ్‌వాదీ పార్టీ అధినేత అఖిలేష్ యాదవ్ అన్నారు. దేశం, ఆర్థిక వ్యవస్థ, రైతులు, యువత ప్రమాదంలో ఉన్నారని చెప్పారు. రైతుల ఆదాయం రెట్టింపు కాలేదని, యువత నిరుద్యోగులుగా ఉన్నారని విమర్శించారు.

## ఒకే నియోజకవర్గంలో
# లక్ష దొంగ ఓట్లు

(మొదటిపేజీ తరువాయి)

ఎన్నికల కమిషన్ డాటాను చూపిస్తూ, ఆ డాటా ఆధారంగా తాము చేసిన విశ్లేషణను ఆయన వివరించారు. 'కర్ణాటకలోని ఒకే నియోజకవర్గంలో లక్ష దొంగ ఓట్లు ఉన్నాయి. ఇది రాజ్యాంగానికి వ్యతిరేకంగా చేసిన నేరం. ఎన్నికల సంఘంతో కలిసి బిజెపి భారీ నేరపూరిత మోసం చేసింది. బిజెపితో ఎన్నికల కమిషన్ కుమ్మక్కైంది. ఇలాంటి పరిస్థితుల్లో ప్రజాస్వామ్యం ఉనికిలో లేకుండా పోతుంది. అందుకే, న్యాయవ్యవస్థ తక్షణం ఈ వ్యవహారంలో జోక్యం చేసుకోవాలి.' అని ఆయన అన్నారు. ఒక్క కర్ణాటకలోనే కాదని, దేశ వ్యాప్తంగా ఇటువంటి పరిస్థితే ఉందని చెప్పారు. 'మహారాష్ట్రలో లోక్‌సభ, అసెంబ్లీ ఎన్నికల మధ్య కోటి మంది కొత్త ఓటర్లు నమోదు అయ్యారు. ఓటర్ల జాబితాను మాకు ఇచ్చేందుకు ఇసి నిరాకరించింది. అది దేశ సంపద. దానిని ఎందుకు ఇవ్వడం లేదు?' అని ఆయన ప్రశ్నించారు. ఈ ఆధారాలను నాశనం చేయడంలో ఎన్నికల సంఘం బిజీగా ఉందని ఆరోపించారు. అసెంబ్లీ ఎన్నికల్లో అవకతవకలు జరిగాయన్న తమ అనుమానం మహారాష్ట్ర ఫలితాలతో నిజమైందన్నారు. మెషిన్ రీడ్ చేయగల ఓటర్ల జాబితాను ఎన్నికల సంఘం ఇవ్వకపోవడం మరిన్ని అనుమానాలకు తావిస్తోందని పేర్కొన్నారు. ఎన్నికల కమిషన్ మోసాలను అనుమతిస్తోందని వందశాతం రుజువులున్నాయని చెప్పారు.

**మహదేవపురలో లక్ష దొంగ ఓట్లు**

కర్ణాటకలోని మహదేవపుర అసెంబ్లీ నియోజకవర్గంలో 6.5 లక్షల ఓట్లకు గాను లక్ష ఓట్లు నకిలీవి, తప్పుడు చిరునామావేనని రాహుల్‌గాంధీ చెప్పారు. తమ పరిశోధనలో ఆ విషయం స్పష్టంగా తేలిందన్నారు. పరిశోధనలో వెలుగులోకి వచ్చిన వివరాలను ఓటర్ పేరు, నెంబర్, పోలింగ్‌బూత్ వివరాలతో సహా పవర్ పాయింట్ ప్రజెంటేషన్‌లో ఆయన చూపించారు. మహాదేవపుర అసెంబ్లీ నియోజకవర్గంలో 11,965 డూప్లికేట్ ఓటర్లు, 40,009 నకిలీ, తప్పుడు చిరునామా, 10,452 బల్క్ లేదా సింగిల్ అడ్రస్ ఓటర్లు, 4,132 తప్పుడు ఫోటోలు ఉన్న ఓటర్లు, మరో 33,692 ఓటర్లు ఫారం-6 దుర్వినియోగం చేసినవి ఉన్నాయని ఆయన వివరించారు. మొత్తంమీద లక్షా 250 దొంగ ఓట్లు ఉన్నట్లు తేలిందని చెప్పారు. బెంగళూరు సెంట్రల్ లోక్‌సభ, మహదేవపుర అసెంబ్లీ నియోజకవర్గాల ఓటర్ల జాబితాలను విశ్లేషించామని తెలిపారు. బెంగళూరు సెంట్రల్ లోక్‌సభ నియోజకవర్గంలోని ఆరు అసెంబ్లీ స్థానాల్లో గెలిచినా, 32,707 ఓట్ల తేడాతో ఎంపి స్థానంలో బిజెపి చేతిలో కాంగ్రెస్ ఓడిపోయిందని తెలిపారు.

**మహారాష్ట్రలో ఐదు నెలల్లో కోటి కొత్త ఓట్లు**

మహారాష్ట్రలో 2024 లోక్‌సభ, 2024 మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల మధ్య (ఐదు నెలల కాలంలో) సమయంలో కోటి మంది ఓటర్లు కొత్తగా నమోదయ్యారని చెప్పారు. 'ఆ రాష్ట్రంలో ఐదు సంవత్సరాల కాలంలో నమోదైన ఓటర్ల కంటే ఐదు నెలల కాలంలో నమోదైన ఓటర్లే ఎక్కువ' అని ఆయన అన్నారు. హర్యానా, మధ్యప్రదేశ్, మహారాష్ట్రల్లో వచ్చిన ఫలితాలు తమ అనుమానాలకు బలం చేకూర్చాయని అన్నారు. అధికారంలో కొనసాగడానికి 25 సీట్లు మోడీకి అవసరమయ్యాయని, 33 వేల కంటే తక్కువ ఓట్ల తేడాతో ఆ స్థానాల్లో బిజెపి గెలిచిందని చెప్పారు. ప్రజాస్వామ్య ప్రక్రియను అనుసరించకుండా ఓట్లను దొంగిలిస్తున్నారని తెలిపారు. ఎన్నికల కమిషన్ విశ్వసనీయత సందేహాస్పదంగా ఉందని రాహుల్‌గాంధీ విమర్శించారు. కాంగ్రెస్ పార్టీ సేకరించిన ఆధారాలను ప్రస్తావిస్తూ పోలింగ్ రోజున సాయంత్రం 5 గంటల తరువాత ఓటర్ల సంఖ్య పెరగడం కూడా ఆశ్చర్యకరమైన విషయమని తెలిపారు. ఓట్ల దొంగతనానికి సంబంధించి సాక్ష్యాలను సేకరించేందుకు ఆరు నెలలు పట్టిందన్నారు. సాయంత్రం 5 గంటల తరువాత ఓటింగ్ ఎందుకు పెరిగింది? ఎన్నికల కమిషన్ దీనికి సమాధానం చెప్పాలని అన్నారు. ఓట్ల దొంగతనానికి సంబంధించి ఎన్నికల కమిషన్‌ను కాంగ్రెస్ పార్టీ పలు ప్రశ్నలు అడిగిందని, ఇప్పటి వరకు ఒక్క సమాధానం కూడా ఇవ్వలేదని తెలిపారు.

# ఎర్రవల్లే కేసీఆర్‌కు చర్లపల్లి

(మొదటిపేజీ తరువాయి)

ఆపార్టీ నేతలు ఫాంహౌస్‌కు వెళ్లి ఆయన్ని కలిసి వస్తుంటారు" అని సీఎం రేవంత్‌రెడ్డి వ్యాఖ్యానించారు. "కేసీఆర్ ఆస్పత్రిలో చేరారని తెలిసి పార్టీ నేతల్ని వెళ్లి చూడమన్నా. బీఆర్ఎస్ నేతలు వద్దన్నారని వారు చెప్పారు. మరి కేసీఆర్ ఆరోగ్యంలో ఏం సీక్రెట్ ఉందో నాకైతే తెలీదు. రాష్ట్రంలో ప్రతిపక్ష నేత ఆరోగ్యంపై ఎప్పటికప్పుడు వాకబ్ చేస్తూ, ఉత్తమమైన వైద్యం అందించాలని ఆరోగ్యశాఖ కార్యదర్శిని ఆదేశించాను" అని తెలిపారు. "నేను విద్వేష రాజకీయాలు చేయడం లేదు. కేసీఆర్ మాదిరి బిట్టర్ (చేదు) పాలిటిక్స్ రావు" అని స్పష్టంచేశారు. సీఎం రేవంత్‌రెడ్డి ఢిల్లీలో మీడియాతో ఇష్టాగోష్టిగా మాట్లాడుతూ పలు అంశాలను ప్రస్తావించారు.

**పీఎం అపాయింట్‌మెంట్ ఇవ్వలేదు**

"బీసీ రిజర్వేషన్లపై ప్రధాని అపాయింట్ మెంట్ అడిగినా ఇవ్వలేదు. ఈ విషయంలో కేంద్ర హెూం శాఖతో సంబంధం లేనందున అమిత్‌షా అపాయింట్‌మెంట్ కోరలేదు" అని స్పష్టం చేశారు.

**చర్చిద్దాం రండి**

**కేంద్రమంత్రి కిషన్ రెడ్డికి సీఎం సవాల్**

బీసీ రిజర్వేషన్ల పెంపుపై కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి చెట్టుకింద ప్లీడర్‌లా, గల్లీ లీడర్‌లా మాట్లాడుతున్నారని సీఎం రేవంత్‌రెడ్డి ఎద్దేవా చేశారు. బీసీ రిజర్వేషన్ల బిల్లులో అసలు ముస్లింల ప్రస్తావన ఎక్కడుందని సీఎం ప్రశ్నించారు. అసలు ఆ బిల్లుల్లో ఏముందో చదివారా? అని ప్రశ్నించారు. ముస్లింలు ఈ దేశంలో పౌరులు కాదా? అని నిలదీసారు. 'వెనుకబాటు, సామాజిక, ఆర్థిక ఆధారాలపై రిజర్వేషన్లు ఉంటాయి. మతపరంగా రాజ్యాంగం రిజర్వేషన్లు కల్పించలేదు. మేం మతం పేరుతో ఎక్కడా రిజర్వేషన్లు కల్పించలేదు. అసలు ఆ బిల్లుల్లో ఎక్కడా కుల, మతాల గురించి రాయలేదు. బీసీలకు 42 శాతం ఎన్ బ్లాక్‌గా రిజర్వేషన్లు కోరుతున్నాం' అని స్పష్టం చేశారు. ముస్లింలు సీఎంలు కావద్దనేలా కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి మాట్లాడడం సరికాదన్నారు. దీనిపై ఎక్కడైనా చర్చకు సిద్ధం. మీరు ఎప్పుడొస్తారో తేదీ, వేదిక, సమయం చెప్పండి" అని సవాలు విసిరారు. ముస్లింలను రాష్ట్రపతులు, ముఖ్యమంత్రుల్ని చేసిన చరిత్ర కాంగ్రెస్‌కు ఉందన్నారు.

**నైతికత ఆత్మహత్య చేసుకుంటుంది.**

బీఆర్ఎస్ నేతలకు నైతికత గురించి మాట్లాడే అర్హత లేదు. వాళ్ళు చేసిన పాపాలకు 'నైతికత' కూడా ఆత్మహత్య చేసుకుంటుంది. బీహార్ ఎన్నికలతోపాటే జూబ్లీహిల్స్ ఉప ఎన్నికకూడా వస్తుందని భావిస్తున్నామని తెలిపారు. మేమే సేఫ్ పార్టీ మారడం తప్పు. పార్టీ మారితే వేటుపడుతుందని సుప్రీం తీర్పు ఇస్తే మేమే సేఫ్. మా దగ్గరున్న 65 మంది ఎమ్మెల్యేలు అలానే ఉంటారు' అని సీఎం రేవంత్‌రెడ్డి చెప్పారు.

**బీసీ సంఘాలతో భేటీ**

బీసీలకు 42 శాతం రిజర్వేషన్ల అమలుపై త్వరలోనే బీసీ సంఘాలు, బీసీ భాగస్వాములతో భేటి అవుతామని తెలిపారు. స్థానిక సంస్థల ఎన్నికలు జరగకపోవడం వల్ల కేంద్రం నుంచి రావాల్సిన నిధులు ఆగిపోయాయన్నారు.

పార్టీపరంగా 42శాతం రిజర్వేషన్లు

"బీసీ బిల్లులకు రాష్ట్రపతి ఆమోదం తెలపకపోతే, పార్టీ పరంగా 42 శాతం అమలుపై పొలిటికల్ అడ్వైజరీ కమిటీ(పీఏసీ)లో చర్చిస్తాం. ఈ విషయంలో ఇతర పార్టీలు కూడా ముందుకొస్తే సంతోషం. రిజర్వేషన్లు 50 శాతం దాటొద్దని కేసీఆర్ తెచ్చిన పంచాయితీరాజ్ చట్టం వల్లే సమస్య తయారైంది" అని చెప్పారు.

**అర్థంలేని మాటలు**

బీసీ రిజర్వేషన్లకు రాహుల్, ఖర్గే సంపూర్ణ మద్దతు ప్రకటించారని సీఎం రేవంత్‌రెడ్డి స్పష్టంచేశారు. జంతర్‌మంతర్‌లో బీసీ రిజర్వేషన్లపై పోరుబాటకు ఖర్గే, రాహుల్ రాలేదని విపక్షాలు చేస్తున్న విమర్శల్లో అర్థం లేదన్నారు. 'రాహుల్ గాంధీ, మల్లికార్జున్ ఖర్గే ఇందిరా భవన్‌లో నాలుగు గంటల పాటు తెలంగాణ కుల సర్వే, బీసీ రిజర్వేషన్ల పెంపుపై నాలుగు గంటలు సావధానంగా విన్నారు. వంద మంది ఎంపీలకు వివరించారు.

## ఒక్కో చేనేత కుటుంబానికి
# ఏడాదికి రూ.25 వేలు

(మొదటిపేజీ తరువాయి)

కలుగుతుందని వివరించారు. 92,724 చేనేత కుటుంబాలకు సామాజిక పింఛన్ల కోసం ఏడాదికి రూ.546 కోట్లు ఖర్చు చేస్తున్నామన్నారు.

**నాగరికత నేర్పిన నేతన్న**

రైతు అన్నంపెడితే నేతన్న నాగరికత నేర్పాడని, భారతీయ శక్తి, సంస్కృతి, సంప్రదాయానికి శతాబ్దాల క్రితమే ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు తెచ్చిన ఘనత మన నేత కార్మికులదని ముఖ్యమంత్రి ప్రశంసించారు. ఆరు గజాల చీర అగ్గిపెట్టెలో పెట్టగలిగే నైపుణ్యం మన చేనేత కళాకారుల సొంతమన్నారు. మంగళగిరి, ధర్మవరం, వెంకటగిరి, ఉప్పాడ, పెడన, చీరాల, పొందూరు, మదనపల్లి, నందవరం, కోడుమూరు, ఎమ్మిగనూరు ఒక్కో ప్రాంతానిది ఒక్కో ప్రత్యేకతని, పొందూరు ఖద్దరును గాంధీజీ మెచ్చితే%ొ% పెడన కళంకారీ ప్రపంచాన్నే ఆకట్టుకుందని, మన నేతన్నలు నేసిన వస్త్రాలను బ్రిటీష్ వారు ఇంగ్లండ్ తీసుకెళ్లి అమ్ముకునేవారని వివరించారు. స్వాతంత్ర్యోద్యమంలో ఖద్దరు ధారణ, నూలు వడకడం దేశభక్తికి నిదర్శనంగా నిలిచాయని గుర్తు చేశారు.

చేనేతల ప్రయోజనం కోసం సత్యాగ్రహం చేసిన చేనేత సూర్యుడు ప్రగడ కోటయ్య జయంతిని ప్రభుత్వం తరఫున నిర్వహిస్తామని చంద్రబాబు ప్రకటించారు.

## సంపాదకీయం

### గ్రేట్ అమెరికానా...

# గ్రేవ్ అమెరికానా...



మేక్ అమెరికా గ్రేట్ అగైన్' నినా దంతో అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రపంచ దేశాలపై భారీగా ప్రతీకార సుంకాలు విధిస్తున్నారు. తమ దేశ ఆర్థిక పరిస్థితి మెరు గుపర్చుకోవాలని చూస్తున్నారు. ఎవడేమైపోతే నాటకేంటి అను కుంటూ.. మిత్ర దేశాలను శత్రువుగా మార్చుకుం టున్నారు. ఇప్పటికే భారత్, చైనా వంటి దేశాల నుంచి దిగుమతులపై 25 శాతం వరకు సుంకాలు విధించారు. అయితే, ఈ ధోరణి అమెరికా ఆర్థిక వ్యవస్థపై విపరీత పరిణామాలను కలిగించే అవకాశం ఉందని నిపుణులు హెచ్చరిస్తున్నారు. ఈ సుంకాలు అమెరికా స్టాక్ మార్కెట్లను దెబ్బతీసిన దాఖలాలు ఇప్పటికే కనిపించాయి, దీర్ఘకాలంలో ఇవి ఆర్థిక సంక్షోభానికి దారితీసే ప్రమాదం ఉంది. 25 శాతం సుంకాలు విధించడం వల్ల దిగుమతి వస్తువుల ధరలు గణనీయంగా పెరుగుతాయి, దీని ఫలితంగా అమెరికాలో ద్రవ్యోల్బణం స్వల్పకాలంలో 2.4 శాతం, దీర్ఘకాలంలో 1.2 శాతం పెరిగే అవకాశం ఉందని నిపుణులు అంచనా వేస్తున్నారు. ఈ ధరల పెరుగుదల సామాన్య అమెరికన్లపై ఏడాదికి సుమారు రూ.2 లక్షల అదనపు ఖర్చును మోపుతుంది. దిగుమతులు తగ్గినప్పటికీ, అమెరికా సొంతంగా ఈ వస్తువులను ఉత్పత్తి చేయలేకపోతే, అధిక ధరలకు దిగుమతులు చేసుకోవడం తప్పనిసరి అవుతుంది. ఈ భారం అమెరికా వినియోగదారులపైనే పడుతుంది, జేపీమోర్గాన్‌చేజ్ ఇన్‌స్టిట్యూట్ అంచనా ప్రకారం, ఈ సుంకాల వల్ల అమెరికా కంపెనీలపై సుమారు రూ.7 లక్షల కోట్ల భారం పడవచ్చు. ఈ ఒత్తిడిని తట్టుకోవడానికి కంపెనీలు రెండు మార్గాలను ఎంచుకోవచ్చు. ఒకటి, వస్తువుల ధరలను పెంచడం.. రెండు, లాభాలను తగ్గించుకోవడం. ధరలు పెంచితే, వినియోగదారులపై భారం మరింత పెరుగుతుంది, లాభాలు తగ్గితే, కంపెనీల ఆర్థిక స్థిరత్వం దెబ్బతింటుంది. ఈ రెండు పరిస్థితులు అమెరికా ఆర్థిక వృద్ధిపై ప్రతికూల ప్రభావితం చూపుతాయి.ట్రంప్ సుంకాలకు ప్రతిగా ఇతర దేశాలు కూడా అమెరికాపై ప్రతీకార సుంకాలు విధించే అవకాశం ఉంది. ఇది అమెరికా ఎగుమతులను తగ్గించి, ఆర్థిక వ్యవస్థలో కీలక రంగాలను బలహీనపరుస్తుంది. నిపుణుల అంచనా ప్రకారం, అంతర్జాతీయ వాణిజ్యం 50 శాతం వరకు క్షీణించవచ్చు. అమెరికా ఎగుమతులు తగ్గడం వల్ల ఉపాధి అవకాశాలు, ఆర్థిక ఉత్పత్తి, మొత్తం జీడీపీపై తీవ్రమైన ప్రభావం పడుతుంది. ఈ వాణిజ్య యుద్ధం అమెరికా ఆర్థిక వ్యవస్థను మరింత ఒత్తిడిలోకి నెట్టవచ్చు. సుంకాల వల్ల జీడీపీ తగ్గడం, ద్రవ్యోల్బణం పెరగడం వల్ల అమెరికన్ డాలర్ విలువ బలహీనపడే అవకాశం ఉంది. కొందరు నిపుణులు డాలర్ విలువ 50 శాతం వరకు తగ్గవచ్చని అంచనా వేస్తున్నారు. ఈ సందర్భంలో బ్రిక్స్ దేశాలు (బ్రెజిల్, రష్యా, ఇండియా, చైనా, దక్షిణాఫ్రికా) స్వంత వాణిజ్య కరెన్సీని అభివృద్ధి చేసే అవకాశం ఉంది, ఇది డాలర్‌ను ప్రపంచ రిజర్వ్ కరెన్సీగా ఉన్న స్థానం నుంచి దిగజార్చవచ్చు. ఇది అమెరికా ఆర్థిక వ్యవస్థకు దీర్ఘకాలిక నష్టం కలిగిస్తుంది. దీంతో గ్రేట్ అమెరికా కాస్త గ్రేవ్(శ్మశానం) అమెరికాగా మారే ప్రమాదం ఉంది అమెరికా అధ్యక్షుడు.. ప్రస్తుత అధ్యక్ష అభ్యర్థి డొనాల్డ్ ట్రంప్ తన అసహనం మరోసారి చూపించారు. భారత్‌పై ఇప్పటికే విధించిన 25 శాతం దిగుమతి సుంకాలను రెట్టింపు చేస్తూ.. వాటిని 50 శాతానికి పెంచనున్నట్లు ట్రంప్ ప్రకటించారు. ఈ ప్రకటన భారత్‌కు ఆర్థికంగా భారీ షాక్‌గా మారనుంది. వైట్‌హౌస్‌కు చెందిన వర్గాల ప్రకారం.. రష్యా నుంచి భారత్ భారీగా చమురు దిగుమతి చేస్తోందన్న కారణంతో ట్రంప్ ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది. అమెరికా విధించిన ఆంక్షలను పక్కనబెట్టి, భారత్ రష్యాతో వాణిజ్య సంబంధాలు కొనసాగిస్తోందన్నదే ప్రధాన కారణంగా పేర్కొంటున్నారు. భారతీయ ఉత్పత్తులపై 50 శాతం దిగుమతి సుంకం విధిస్తే.. టెక్స్‌టైల్, ఆటోపార్ట్స్, కెమికల్స్, స్టీల్, ఫార్మాస్యూటికల్స్ వంటి రంగాలు తీవ్రంగా ప్రభావితమవుతాయి. ఇప్పటికే అమెరికా మార్కెట్‌లో పోటీ పెరుగుతున్న నేపథ్యంలో, ఈ సుంకం పెంపుతో భారత దిగుమతులు మరింత ధర పెరిగి, వినియోగదారులకు దూరమవుతాయి.ట్రంప్ నిర్ణయం అంతర్జాతీయ రాజకీయ వర్గాల్లో కూడా చర్చనీయాంశంగా మారింది. రష్యా?ఉక్రెయిన్ యుద్ధంతో ఇప్పటికే ప్రపంచ వాణిజ్యంలో గందరగోళం నెలకొన్న సమయంలో, భారత్‌పై ఈ విధమైన ఆర్థిక ఒత్తిడిని పెంచడం ప్రస్తుత పరిణామాలపై ప్రభావం చూపే అవకాశం ఉంది.ఇందుకు సంబంధించి అధికారికంగా భారత ప్రభుత్వం నుంచి స్పందన ఇంకా రాలేదు. అయితే గతంలో కూడా ఇలాంటి పరిస్థితుల్లో భారత్ సంయమనం పాటిస్తూ వ్యూహాత్మకంగా వ్యవహరించిన సందర్భాలున్నాయి. తాజా నిర్ణయం నేపథ్యంలో కూడా కేంద్రం ఆర్థిక, విదేశాంగ శాఖలు తగిన చర్యలు తీసుకుంటాయని భావిస్తున్నారు.ట్రంప్ మరోసారి తన 'అమెరికా ఫస్ట్' విధానాన్ని పదిమార్లు బలంగా వెల్లడించారు. అయితే ప్రపంచ మిత్ర దేశాలతో సంబంధాలు పాడుచేయడం ఎంతవరకు సరైన విధానమో అనేది ప్రశ్నార్థకంగా మారింది. భారత్‌పై పెరిగిన ఈ సుంక భారం.. రెండు దేశాల మధ్య వాణిజ్య సంబంధాలకు గండికొడతుందా? లేక భారత్ వ్యూహాత్మకంగా దీన్ని అధిగమిస్తుందా? అన్నది చూడాల్సి ఉంది.

## పెరుగుతున్న దూరం...

**గుంటూరు-సూర్య వాస్తవం :** ఏపీలో అధికారం పోయిన తర్వాత బీజేపీకి దగ్గరయ్యేందుకు తీవ్రప్రయత్నాలు చేస్తున్నారు మాజీ సీఎం జగన్. బెంగుళూరు వేదికగా అక్కడి నేతల ద్వారా తనవంతు ప్రయత్నాలు చేశారు. ఈ విషయంలో బీజేపీ నుంచి ఎలాంటి సంకేతాలు రాలేదు. దీంతో జగన్ జిల్లాల పర్యటనకు శ్రీకారం చుట్టారు. దాని ద్వారా బల ప్రదర్శన చేశారు. జగన్‌కు మద్దతుగా ఉండే ఏపీలో కొందరు బీజేపీ నేతలు హైకమాండ్‌కి దృష్టికి పంపించినట్టు సమాచారం. ఎన్నికల్లో ఓడినా, మాజీ సీఎంకు ప్రజల్లో ఆదరణ ఉందన్నది అందులోని సారాంశం. ఈ విషయం లో కమలనాథుల నుంచి ఎలాంటి సంకేతాలు వచ్చేయో తెలీదు. మంత్రి సత్యకుమార్ ఎదురుదాడి చూసి షాకయ్యారు వైసీపీ నేతలు. ఏపీలో కూటమి అధికారంలోకి వచ్చిన తర్వాత వైసీపీ నేతలకు కౌంటరిస్తున్నారు టీడీపీ-జనసేన నేతలు. కానీ బీజేపీ నుంచి ఎలాంటి కౌంటర్లు పడలేదు. హైకమాండ్ సంకేతాలు ఏమో తెలీదుగానీ మంత్రి సత్యకుమార్ కీలక వ్యాఖ్యలు చేశారు. మద్య కుంభకోణం సూత్రధారి జగన్ అరెస్టు కాను న్నారంటూ కీలక వ్యాఖ్యలు చేశారు. అంతేకాదు కూటమి ఏడాది పాలనపై చర్చకు సిద్ధమేనంటూ ఎటాకింగ్ మొదలుపెట్టారు. ఉన్న ట్లుండి మంత్రి సత్యకుమార్ కామెంట్స్‌పై వైసీపీలో అప్పుడే చర్చ మొదలైంది. మంత్రి మాటల వెనుక బీజేపీ హైకమాండ్ ఉండవచ్చని అంటున్నారు. అందువల్లే నేరుగా లిక్కర్ స్కామ్‌లో జగన్ అరెస్టు కావడం ఖాయమని ఓపెన్‌గా చెప్పారని అంటున్నారు. మంత్రి సత్యకుమార్ గురించి చెప్పనక్కర్లేదు. హోం మంత్రి అమిత్ షాకు సత్యకుమార్ నమ్మినబంటుగా చెబుతారు ఆ పార్టీ నేతలు. సమయం, సంద ర్భం వచ్చినప్పుడు ఆఫ్ ద రికార్డులో చెబు తుంటారు. అందువల్లే మొన్నటి ఎన్నికల్లో ఆయన ధర్మ వరం నుంచి గెలవడం, ఆ తర్వాత చంద్రబాబు కేబినెట్‌లో మంత్రి కావడం చకచకా జరిగి పోయిం దని అంటున్నారు. దీనికితోడు లిక్కర్ కేసు వ్యవహారం వైసీపీని కకావికలం చేసింది. దాని మూలా లు ఏకంగా అధినేత మెడకు చుట్టుకున్నాయి. జరిగిన.. జరుగుతున్న పరిణామాలను గమనించిన బీజేపీ పెద్దలు మంత్రి సత్య కుమార్ ద్వారా ఎదురుదాడికి దిగేలా చేశాయని అనుకుంటున్నారు వైసీపీ నేతలు. ఈ లెక్కన వైసీపీకి కమలం నుంచి కష్టాలు తప్పవంటున్నారు. రాబోయే రోజుల్లో ఇంకా ఏం జరుగుతుందో చూడాలి.

# ట్రబుల్ షూటర్ కోసం.. హైరానా

**నెల్లూరు - సూర్య వాస్తవం :**

విజయసాయి రెడ్డి విషయంలో జగన్ ఎటూ తేల్చుకో లేకపోతున్నారా? వైసీపీలోకి రీఎంట్రీ కి గ్రీన్ సిగ్నల్ ఇవ్వ లేకపోతున్నారా? అసలు వైసీపీ అధినేత మదిలో ఏముంది? సాయి రెడ్డి విషయంలో ఎలాంటి ఆలోచనతో ఉన్నారు? ఇప్పుడు పొలిటికల్ వర్గాల్లో ఇదే చర్చ నడుస్తోంది. వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ పునాది నుంచి ఉన్నారు విజయసాయిరెడ్డి. అధినేత కష్టసుఖాల్లో సైతం పాలుపం చుకున్నారు. వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చేందుకు అహ ర్నిశలు శ్రమించారు. అటువంటి నేత ఇటీవల పార్టీకి దూరమయ్యారు. ఇంతవరకు ఏ పార్టీలో కూడా చేరలేదు. అయితే ఇప్పుడు విజయసాయిరెడ్డిని పార్టీలోకి రప్పించేందుకు ఏర్పాట్లు జరుగుతున్నాయని ప్రచారం జరుగుతోంది. ముఖ్యంగా అటు విజయ సాయి రెడ్డికి, ఇటు జగన్మోహన్ రెడ్డికి మధ్య సన్నిహితంగా ఉన్న రంగంలోకి దిగినట్లు తెలుస్తోంది. అయితే విజయసాయిరెడ్డి పై కొంతమంది నేతల అభ్యంతరం ఉండడంతోనే జగన్ నిర్ణయం తీసుకో వడంలో ఆలస్యం జరుగుతోందన్న ప్రచారం నడుస్తోంది.వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ ఆవిర్భావంలో విజయసాయిరెడ్డి పాత్ర స్పష్టంగా ఉంది. సాయి రెడ్డి వైయస్సార్ కుటుంబ ఆడిటర్ గా ఉండేవారు. అలా జగన్మోహన్ రెడ్డికి దగ్గరయ్యారు. జగన్ తో పార్టీ అవినీతి ఆరోపణలు ఎదుర్కొన్నారు. అవినీతి కేసుల్లో 16 నెలల పాటు జైలు జీవితం అనుభవించారు. వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ ఏర్పాటుకు బీజం వేసింది




విజయసాయిరెడ్డి అని అప్పట్లో టాక్ నడిచింది. అందుకు తగ్గట్టుగానే వైయస్సార్ కాంగ్రెస్ పార్టీకి అండగా నిలబడ్డారు విజయసాయిరెడ్డి. తొలిసారి పార్టీ అధికారంలోకి రాకపోయినా.. ఇబ్బందికర పరిస్థితులు ఎదురైనా.. ఢిల్లీ స్థాయిలో లాబీయింగ్ చేసి.. పార్టీ అధికారంలోకి వచ్చేందుకు కారణ మయ్యారు. పార్టీ అధికారంలో ఉన్నప్పుడు తన హవాను చెలాయించారు. అయితే ఈ ఎన్నికల్లో ఓటమి తర్వాత ఒక ప్రత్యేక పరిస్థితుల్లో బయటకు వెళ్లారు విజయసాయిరెడ్డి.అయితే ప్రస్తుతం వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ సంక్లిష్ట పరిస్థితుల్లో ఉంది. పార్టీకి దారుణ పరాజయం ఎదురయింది. కూటమి ప్రభుత్వ ఉక్కు పాదం మోపుతోంది. జగన్ చుట్టూ ఉన్న నేతలంతా అరెస్టు అయ్యారు. రాష్ట్రంలో ఇతర పార్టీల నుంచి సహకారం లేదు. జాతీయ స్థాయిలో సైతం మద్దతు తెలిపేవారు కరువయ్యారు. జాతీయ పార్టీలతో లాబీయింగ్ చేసే నేత కూడా కనిపిం చకుండా పోయారు. విజయసాయిరెడ్డి లేని లోటు స్పష్టంగా కనిపిస్తోంది. ఇదే విషయాన్ని జగన్ మోహన్ రెడ్డి సన్నిహిత నేత ఆయనకు గుర్తు చేసినట్లు తెలుస్తోంది. పార్టీలోకి విజయసాయిరెడ్డిని తీసుకొస్తే మంచిదని ఆయన సలహా ఇచ్చినట్లు సమాచారం. అయితే జగన్మోహన్ రెడ్డి మాత్రం ఈ విషయంపై ఏమీ మాట్లాడలేదని తెలుస్తోంది. అయితే ఏదైనా విషయాన్ని ముఖం మీద తేల్చేయడం జగన్ కు ఉన్న అలవాటు. దీంతో విజయసాయిరెడ్డి విషయంలో ఆలోచన చేస్తున్నట్లు అర్థమవుతోంది.అయితే విజయ సాయిరెడ్డి విషయంలో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీలోని చాలామంది నేతలు అభ్యంతరాలు వ్యక్తం చేస్తున్నట్లు తెలుస్తోంది. కాకినాడ సి పోర్టు కేసు విచారణకు హాజరైన ఆయన మాట్లాడిన తర్వాతే.. మద్యం కుంభకోణం కేసులో సిట్ చర్యలను వేగవంతం చేసింది. నేతల అరెస్టు ప్రారంభమైంది. కేవలం విజయసాయిరెడ్డి ఇచ్చిన సమాచారంతోనే ప్రత్యేక దర్యాప్తు బృందం పట్టు బిగించిందన్న అనుమానాలు ఉన్నాయి. అటువంటి నేతను ఎలా పార్టీలోకి తీసుకుంటారని చాలామంది అభ్యంతరాలు వ్యక్తం చేస్తున్నట్లు తెలుస్తోంది. అందుకే జగన్మోహన్ రెడ్డి విజయసాయిరెడ్డి విషయంలో ఎలా అడుగు ముందుకు వేయాలో తెలియడం లేదు. అందుకే తన నిర్ణయాన్ని వాయిదా వేసినట్లు ప్రచారం నడుస్తోంది. మొత్తానికి అయితే పరిస్థితులు చూస్తుంటే విజయ సాయిరెడ్డి వైసీపీలోకి రీఎంట్రీ ఖాయమని తెలుస్తోంది.

# మళ్లీ జిల్లాల పునరవ్యవస్థీకరణ

**అనంతపురం-సూర్య వాస్తవం**

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం కొత్త జిల్లాల ఏర్పాటు.. జిల్లాలు సరి హద్దులు, పేర్ల మార్పు.. మండలాల మార్పులు, చేర్పులపై కసరత్తు చేస్తోంది. ఇటీవల ఏడుగురు మంత్రులతో మంత్రివర్గ ఉపసంఘాన్ని కూడా ఏర్పాటు చేసింది. ఈ కమిటీలో అనగాని సత్యప్రసాద్, నిమ్మల రామానాయుడు, నాదెండ్ల మనోహర్, సత్యకుమార్ యాదవ్, పి.నారాయణ, వంగలపూడి అనిత, బీసీ జనార్దన్‌రెడ్డిలు సభ్యులుగా ఉన్నారు. తాజాగా కేబినెట్ భేటీలో జిల్లాలకు సంబం ధించిన అంశాలన్ని చంద్రబాబు ప్రస్తావించారు. ఈ మేరకు నెల రోజుల్లో నివేదిక ఇవ్వాలని ఆ కేబినెట్ సబ్ కమిటీని ఆదేశించారు.ఈ మేరకు జిల్లాల పేర్ల మార్పు, ప్రధాన కేంద్రాలు, డివిజన్‌లు, సరిహద్దులు, మండలాల అంశంపై కమిటీ పరిశీలన ఎంతవరకు వచ్చిందని ఆరా తీశారట. అలసు ప్రజల నుంచి వచ్చిన ఫిర్యాదులను పరిశీలించారా అని అడిగారట. కొత్త జిల్లాల ఏర్పాటులో గత ప్రభుత్వం కొన్ని తప్పులు చేసిందన్న చంద్రబాబు.. వాటిని సరిదిద్దాల్సిన అవసరం ఉందని వ్యాఖ్యానించారట. ఈ నెల 12 తర్వాత ఉపసంఘం సమావేశం అవుతుందని మంత్రి అనగాని సత్యప్రసాద్ సీఎంకు వివరించారట. అయితే డిసెంబర్ నాటికి ఈ సమస్యల్ని ఓ కొలిక్కి రావాలని ఆలస్యం చేయొద్దని సూచించారట. ఈ ఉప సంఘం జిల్లాల పేర్ల మార్పు, సరిహద్దుల మార్పు, ప్రధాన కార్యాలయాల మార్పు వంటి అంశాలను పరిశీలి




స్తుంది. వీటితో పాటుగా డివిజన్లు, మండలాల అంశాలను కూడా పరిశీలిస్తుంది. ప్రజల నుంచి వచ్చిన ఫిర్యాదులను కూడా ఉపసంఘం పరిశీలించి నివేదికను తయారు చేయనుంది.ఏపీలో పలు కొత్త జిల్లాల ఏర్పాటు, పేర్ల మార్పు, జిల్లాలు, మండలాలకు సంబంధించిన డిమాండ్‌లు తెరపైకి వచ్చాయి. ప్రధానంగా ప్రకాశం జిల్లాలో పశ్చిమ ప్రాంతాన్ని మార్కాపురం కొత్త జిల్లాగా ఏర్పాటు చేయాలనే డిమాండ్ గత ఐదేళ్లుగా వినిపిస్తోంది. ఈ మేరకు ఎన్నికల ప్రచారంలో కూడా చంద్రబాబు కొత్త జిల్లా ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు. యర్రగొండపాలెం, కనిగిరి, మార్కాపురం, గిద్దలూరు, దర్శి నియోజకవర్గాలు కలిపి జిల్లా ఏర్పాటు చేయాలనే డిమాండ్ ఉంది. ఈ అంశం కూడా ప్రస్తుతం తెరపైకి వచ్చింది. అన్నమయ్య జిల్లాకు సంబంధించి రాయ చోటి కాకుండా రాజంపేట ప్రధాన కేంద్రంగా ఉండాలనే డిమాండ్ వినిపి స్తోంది. పశ్చిమ గోదావరి జిల్లాకు నర్సా పురాన్ని ప్రధాన కేంద్రంగా ఏర్పాటు చేయాలని ప్రజలు కోరుతున్నారు.. కానీ భీమవరాన్ని పశ్చిమగోదావరి జిల్లా ప్రధాన కేంద్రంగా ప్రకటించారు. ఇటు శ్రీసత్యసాయి జిల్లాకు సంబంధించి హిం దూపురాన్ని జిల్లా కేంద్రంగా చేయాలని ప్రజలు అడుగుతున్నారు. హిందూపురం ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ కూడా ఇదే డిమాండ్ వినిపిస్తున్నారు. ప్రస్తుతం శ్రీసత్యసాయి జిల్లా ప్రధాన కేంద్రంగా పుట్టపర్తి ఉంది.కొత్త 26 జిల్లాల్లో ఒక గిరిజన జిల్లా ఉంటుందని చెప్పిన గత ప్రభుత్వం.. రెండు జిల్లాలను ప్రకటించింది. పాడేరు ప్రధాన కేంద్రం అల్లూరి సీతారామరాజు.. పార్వతీపురం ప్రధాన కేంద్రంగా మన్యం జిల్లా ఏర్పాటైంది. అయితే మన్యం జిల్లా పేరు మార్చాలనే డిమాండ్ తెరపైకి వచ్చింది. రెవెన్యూ డివిజన్ల విభజనపై కూడా వినతులు వస్తు?న్నాయి. వీటితో పాటుగా పలు రెవెన్యూ డివిజన్లు, మండలాల అంశాలు కూడా తెరపైకి వచ్చాయి.. వాటిని సరిచేయాలని ప్రజలు కోరుతున్నారు.

# విశాఖ - రాయ్‌పూర్ గ్రీన్ ఫీల్డ్ నేషనల్ హైవే

**విజయనగరం - సూర్య వాస్తవం :**

కేంద్రం ఏపీకి ఎనలేని ప్రాధాన్యమిస్తోంది. కీలక ప్రాజెక్టులను మంజూరు చేస్తోంది. ముఖ్యంగా రైల్వేతో పాటు జాతీయ రహదారులకు సంబం ధించిన ప్రాజెక్టులను ఏపీకి కేటాయిస్తోంది కేంద్రం. భవిష్యత్తులో అమెరికా తరహాలో ఏపీ రోడ్లు ఉంటాయని కేంద్ర మంత్రి నితిన్ గడ్కరి ప్రకటించిన సంగతి తెలిసిందే. ఇటువంటి పరిస్థితుల్లో విశాఖ రాయ్ పూర్ గ్రీన్ ఫీల్డ్ నేషనల్ హైవే నిర్మాణం పనులు వేగవంతం అయ్యాయి. ప్రధాని నరేంద్ర మోడీ 2022 నవంబరులో ఈ రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. మొత్తం 464 కిలోమీటర్ల దూరం ఉన్న ఈ రహదారిని 2024 నాటికి పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నారు.

అయితే వివిధ కారణాలతో ఈ రోడ్డు నిర్మాణం పూర్తి కాలేదు. దీంతో ఈ ఏడాది డిసెంబర్ వరకు గడువు పొడి గించారు. అయితే తాజా పరిస్థితుల దృష్ట్యా వచ్చే ఏడాదికి ఈ పనులు పూర్తయ్యే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. అయితే ఎట్టి పరిస్థితుల్లో గడువులోగా రహదారి నిర్మాణ పనులు పూర్తి చేయాలని జాతీయ రహదారుల సంస్థ నిర్ణయించినట్లు తెలుస్తోంది. మూడేళ్ల కిందట ఈ హైవే నిర్మాణ పనులు ప్రారంభమయ్యాయి. ప్యాకేజీ 4 కింద విజయ నగరం జిల్లా కంటకాపల్లి, విశాఖ జిల్లా సబ్బవరం మధ్య 19.562 కిలోమీటర్ల



పొడవునా పనులు జరుగుతున్నాయి. అయితే ఓ రెండు కిలోమీటర్లు మినహా రోడ్డు పనులు తుది దశకు వచ్చాయి. రూ.638 కోట్ల రూపాయల అంచనా వ్యయంతో ఈ ప్యాకేజీ పనులు జరుగుతున్నాయి. మరోవైపు ఉత్తరావల్లి కంటకాపల్లి మధ్య రెండు కిలోమీటర్ల హైవే పనులు ఇప్పటివరకు మొదలు పెట్టలేదు. అయితే ఇక్కడ పరిహారం సమస్య ఉంది. నిర్వాసితులు కోర్టుకు వెళ్లారు.

కోర్టు పరిధిలో ఉండడం వల్లే ఇక్కడ రోడ్డు పనులు ప్రారంభం కాలేదు. ఇంకోవైపు విశాఖ అరకు నేషనల్ హైవే పక్కన గాంధీనగర్ దగ్గర లింక్ రోడ్డు పనులు కొనసాగుతున్నాయి. అలాగే కొత్తవలస కిరుండాల్ రైల్వే లైన్ పై ఫ్లై ఓవర్ నిర్మాణం కూడా జరుగుతోంది.ఇదే మార్గంలో గులివిందాడ, కొండ డాబాలు ప్రాంతంలో నేషనల్ హైవే పనులు నిలిచిపోయాయి. అక్కడ టోల్ ప్లాజా నిర్మాణం వల్ల పనులకు ఆటంకం కలిగింది. సమీపంలో బ్రిడ్జి నిర్మాణం కూడా ఆగి పోయింది. అయితే విద్యుత్ లైన్ల మార్పు, భూ సేకరణ సమస్యల వల్ల ఆగినట్లు తెలుస్తోంది. వీలై నంత త్వరగా వాటిని పరిష్కరించి పనులు మొదలు పెడ తామని అధికారులు చెబుతున్నారు. గులివిందాడ దగ్గర్లో 400 కె.వి విద్యుత్ లైన్ మార్చాల్సి ఉండగా.. దీనికి అనుమతులు రావడంతో త్వరలో పనులు మొదలు పెడతామంటున్నారు అధికారులు. బ్రిడ్జి కోసం హైవేకు ఇరువైపులా స్తంభాలు వేశారు. అయితే అక్కడ 400 కే.వి విద్యుత్ లైన్ ను మార్చాల్సి ఉంది.విశాఖ నుంచి రాయపూర్ వరకు నిర్మిస్తున్న ఈ రహదారి.. మధ్యలో విజయ నగరం, పార్వతీపురం మన్యం మీదుగా వెళుతుంది. మధ్యలో ఒడిస్సా కూడా ఉంటుంది. ఈ హైవే అందుబాటులోకి వస్తే ఒడిస్సా తో పాటు చత్తీస్గఢ్ వెళ్లేందుకు ప్రయాణించే సమయం తగ్గుతుంది. 12 గంటల్లో కాకుండా ఆరు గంటల్లోనే వెళ్లొచ్చు. విశాఖ నుంచి పారిశ్రామిక ఉత్పత్తులు, వన రులు తరలించేందుకు ఎంతగానో దోహదపడనుంది.

## విద్యార్థుల శ్రమదానం



**పత్తికొండ టౌన్ -సూర్య వాస్తవం, ఆగస్టు 7:** జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల, పులికొండ గ్రామం ఇటీవలనే ( గత2 సంవత్సరాలనుండి) ' ఉన్నత పాఠశాల'గా స్థాయి పెరిగింది. కాని ఆ గ్రామ పాఠశాల కు సరిఅయిన ఆట మైదానం లేదు. దాదాపుగా 10 సంవత్సరాలగా, గ్రామంలో పని చేసే ఉపాధ్యాయులు, ఇటీవలే పాఠశాలకు వచ్చిన ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు, పాఠశాల సహాయక ఉపాధ్యాయులు, పీఎస్ హెచ్ఎం మొదలగు వారు ప్రతి ఆగస్టు 15,జనవరి 26 వేడుకలకు ఆటలు ఆడించడానికి విద్యార్థులను ఎటువంటి మైదానం లేకున్నా కూడా ఉపాధ్యాయుల మనసు మార్గంతో విద్యార్థుల కృషితో గొర్రెలు ఆగే స్థలము ను పరిశుభ్రం చేసుకుని ఆట మైదానంగా మార్చుకున్నారు. అలాగే ఉపాధ్యాయులు వారికి పరిసరాల పరిశుభ్రత గురించి వివరించారు.

## దేవన బండ గ్రామంలో ఫాగింగ్



**పత్తికొండ టౌన్ -సూర్య వాస్తవం, ఆగస్టు 7:** పత్తికొండ మండలం దేవనబండ పందికోన గ్రామాలలో నేడు డిప్యూటీ ఎంపీడీవో నరసింహులు ఆధ్వర్యంలో ఐ.వి.ఆర్.ఎస్ కాల్స కార్యక్రమంలో అవగాహన కల్పిస్తూ వివిధ గ్రామాలలో ఫాగింగ్ చేయడం జరిగింది. ఈ గ్రామాలలో పారిశుద్ధ్య పనులు దగ్గరుండి పరిశీలించారు అందుకుగాను పరిశుద్ధ కార్మికులతో డిప్యూటీ ఎంపీడీవో నరసింహులు గ్రామ ప్రజలకు అవగాహన కార్యక్రమం చేయడము ప్రజలను పరిశుభ్రత పాటించాలని గ్రామాల్లో పరిశుద్ధత ఉంచాలని ఆయన కోరారు.

### పులివెందుల జెడ్పీటీసీ

## ఉప ఎన్నికల ప్రచారం

### -పాల్గొన్న సీడ్స్ చైర్మన్ ధర్మవరం మన్నే సుబ్బారెడ్డి



**డోన్ -సూర్య వాస్తవం ,ఆగస్టు 7:** పులివెందుల జెడ్పీటీసీ ఉప ఎన్నికల సందర్భంగా ఎలక్షన్ ఇంఛార్జ్ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సీడ్స్ డెవలప్మెంట్ కార్పొరేషన్ చైర్మన్ ధర్మవరం మన్నే సుబ్బారెడ్డి పులివెందుల మండ లంలోని పోట్రాయిన్ పేట,కానేపల్లి గ్రామా లలో ప్రచార కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సీడ్స్ డెవలప్మెంట్ కార్పొరేషన్ చైర్మన్ ధర్మవరం మన్నే సుబ్బారెడ్డి, ఓటర్లతో. ఎన్డీఏ కూటమి జడ్పీటీసీ అభ్యర్థి మారెడ్డి లతారెడ్డిని పోలింగ్ తేదీ:12.08.2025న సైకిల్ గుర్తుపై ఓటు వేసి, వేయించి అఖండ మెజార్టీతో గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో బి.టెక్ రవి తమ్ముడు భరత్ రెడ్డి ,షేక్ మహబూబ్ బాషా,స్టేట్ హాజ్ కమిటీ డైరెక్టర్, చిన్న వెంకట రెడ్డి , అంజి రెడ్డి , సోమేజ్ రెడ్డి, బింగి రెడ్డి గంగరాజు, రాజ, చిన్నలక్ష్మణ, సుబ్బారాయుడు వెంకటనారాయణ రెడ్డి,కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## రైతులకు మెరుగైన సేవలు అందించండి

**రాప్తాడు- -సూర్య వాస్తవం ,ఆగస్టు 7:** రైతులకు అనునిత్యం అందుబాటులో ఉంటూ మెరుగైన సేవలు అందించాలని ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘాల నూతన కమిటీ సభ్యులకు రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీత సూచించారు.అనంతపురం లోని టిడిపి క్యాంపు కార్యాలయం నందు సమావేశం ఏర్పాటు చేశారు.అనంతపురం రూరల్ మండల పరిధిలోని రాచానపల్లి చియ్యేడు ఆత్మకూరు మండల పరిధిలోని ముట్టాలకు సంబంధించి నూతన కమిటీని ఎంపిక చేశారు. రాచానపల్లి పిఎసిఎస్ అధ్యక్షుడిగా పాముురాయి కలిమిశెట్టి రఘు సభ్యులుగా చిన్నంపల్లి ఎమ్.శ్రీనివాసులు కొడిమి బండి నారాయణని ఎంపిక చేశారు.చియ్యేడు అధ్యక్షుడిగా చియ్యేడు బోయ లక్ష్మీనారాయణ సభ్యులుగా ఆకుతోటపల్లి సాకే శ్రీరాములు పూలకుంట సుధాకర్ రెడ్డిలు ఎంపికయ్యారు. ఆత్మకూరు మండలం ముట్టాల పిఎసిఎస్ అధ్యక్షులుగా ముట్టాల బోయ గంతి లింగన్న సభ్యులుగా సిద్దరాంపురం కురుబ నారాయణప్ప మదిగుబ్బ బోయ బొమ్మయ్య ఎంపికయ్యారు. అనంతరం రెండు మండలాలకు సంబంధించిన సుమారు వందమందికి పైగా నాయకులు కార్యకర్తలు ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలిపారు.తమను అధ్యక్షులుగా సభ్యులుగా నియమించినందుకు ఎమ్మెల్యేను ఘనంగా సన్మానించారు.ఈ సంధర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రైతులకు మేలు చేసే విధంగా మీకు మంచి పదవులు వచ్చాయి. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని ప్రభుత్వానికి మంచి పేరు తీసుకురావాలన్నారు. రైతులకు తక్కువ వడ్డీ రేట్లకు రుణాలు ఇవ్వడం వ్యవసాయ ఇన్ పుట్ సబ్సిడీ లను అందించడం మార్కెటింగ్ సౌకర్యాలను కల్పించడం వంటి సేవలను మెరుగ్గా అందించాలి అని అన్నారు.రైతులు ఎదుర్కొంటున్న ఇబ్బందులను ఎప్పటికప్పుడు సంబంధిత అధికారులు దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేందుకు కృషి చేయాలి అన్నారు.తమకిచ్చిన అవకాశాన్ని కచ్చితంగా సద్వినియోగం చేసుకుంటాము. రైతాంగ సమస్యలు పరిష్కరించడంలో నిరంతరం కృషి చేస్తూనే ఉంటామని నూతన కమిటీ సభ్యులు తెలియజేశారు.



### పోలీసు పిల్లల చదువులను

## ప్రోత్సహిస్తూ ప్రతిభ పురస్కారాలు

**- 107 మంది పోలీసు పిల్లలకు రూ. 6,23,500ల**

**మెరిట్ స్కాలర్ షిప్పులు అందజేసిన జిల్లా ఎస్పీ పి .జగదీష్**





**అనంతపురం క్రైం - సూర్య వాస్తవం, ఆగస్టు 7:** అనంతపురం జిల్లాకు చెందిన పోలీసు పిల్లల చదువులను ప్రోత్సహిస్తూ రాష్ట్ర డి.జి.పి హరీష్ కుమార్ గుప్తా ఉత్తర్వులు మేరకు 2024-25 సం., ప్రతిభా పురస్కారాలు (మెరిట్ స్కాలర్ షిప్పులను) అందజేశారు జిల్లా ఎస్పీ పి.జగదీష్ పదవ తరగతి, ఇంటర్ , ఎంటెక్, ఎంబిఎ లలో మంచి మార్కులు సాధించిన 107 మంది పోలీసు పిల్లలకు మొత్తం రూ. 6,23,500/-ల విలువ చేసే చెక్కులను జిల్లా పోలీసు సంక్షేమనిధి నుండీ ప్రోత్సహకాలు, ప్రశంసా పత్రాలు ఎస్పీ అందజేశారు. స్థానిక పోలీసు కాన్ఫరెన్స్ హాలులో జరిగిన ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న జిల్లా ఎస్పీ గారు మాట్లాడారు. పోలీసు పిల్లల ప్రతిభను గుర్తించడంతో పాటు పోలీసు కుటుంబాలను గౌరవించాలనే మెరిట్ స్కాలర్ షిప్పులు అందజేస్తున్నాం. పోలీసు పిల్లలు 2024-25 సం.లో చక్కగా చదివి మంచి మార్కులు సాధించి ప్రతిభా పురస్కరాలు అందుకోవడం ప్రశంసనీయం. మున్ముందు కూడా చదువుల్లో రెట్టింపు కృషి చేయాలి. లక్ష్యం చేరే వరకు అలసత్వం వద్దు. పట్టుదల, కృషి ముఖ్యం. సమాజంలో మంచి పౌరులుగా తయారు కావాలి. ఇతర పిల్లలకు స్ఫూర్తినిచ్చే విధంగా చదువులో రాణించడమే కాకుండా నిజజీవితంలో కూడా కూడా ఆదర్శంగా నిలవాలి. పిల్లలకు మంచి భవిష్యత్తు కల్పించడంలో తల్లిదండ్రులు నిరంతరం కష్టిస్తున్నారు. పిల్లలు కూడా తల్లిదండ్రుల కష్టాన్ని గుర్తెరిగి అభివృద్ధికి బాటలు వేసుకోవాలి. సమాజంలో ఇతర పిల్లలకు ఏమాత్రం తీసిపోని విధంగా పోలీసు పిల్లలు ఎదగాలి. నైపుణ్యాలు, పరిజ్ఞానాన్ని పెంపొందించుని ఇష్టంతోనే ఏ రంగంలోనైనా రాణించాలి. ఏరంగంలో రాణించాలన్నా చదువులు ముఖ్యం. తల్లిదండ్రులు ఎల్లప్పుడూ పిల్లల పట్ల బాధ్యతతో ఉండటంతో పాటు త్యాగాలు కూడా చేస్తున్నారు. ఎంత ఉన్నత హొదాలు, స్థాయిలకు వెళ్లినా... ఖండాలు దాటినా తల్లిదండ్రులను మరవకండి. శేష జీవితంలో తల్లిదండ్రులను బాగా చూసుకోండనీ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏ.ఆర్ అదనపు ఎస్పీ ఇలియాస్ బాషా, ఏ.ఆర్ డీఎస్పీ నీలకంతేశ్వరరెడ్డి, సి.ఐ లు ధరణీ కిశోర్, దేవానంద్, వంశీకృష్ణ, హరినాథ్ , ఆర్ ఐ లు మధు, పవన్ కుమార్, రాముడు, ఎస్పీ సిసి ఆంజనేయప్రసాద్ , జిల్లా పోలీసు కార్యాలయం బి సూపరింటెండెంట్ ప్రసాద్, ఆర్ ఎస్ ఐ బాబ్జాన్ , పోలీసు అధికారుల సంఘం అడహక్ కమిటీ రాష్ట్ర సభ్యులు ఆర్ ఎస్ ఐ జాఫర్, జిల్లా కమిటీ సభ్యులు గాండ్ల హరినాథ్, సుధాకర్ రెడ్డి, శ్రీనివాసుల నాయుడు, లక్ష్మీనారాయణ, జి.టి సరోజ, పోలీసు పిల్లలు, తల్లిదండ్రులు, తదితరులు పాల్గొన్నారు.

### ప్రజాస్వామిబద్ధంగా ఓట్లు అడగాలే తప్ప

## దాడులకు పాల్పడడం హేయమైన చర్య

**- వైసీపీ రాష్ట్ర పంచాయతీ రాజ్ విభాగ ప్రధాన కార్యదర్శి చీర్ల సురేష్ యాదవ్**



**చెన్నూరు - సూర్య వాస్తవం, ఆగస్టు 7:** ప్రజాస్వామ్యంలో ప్రజల నిర్దేశ ప్రకారం ప్రజా బద్ధకంగా ఎన్నికలకు వెళ్లి ప్రజల మద్దతుతో విజయం సాధించాలి అలా కాకుండా ప్రజాస్వామికంగా తమ గుండాయిజంతో, రౌడీయిజంతో బరితెగించి కూటమి నేతలు ఒక బీసీ నాయకుని పై అత్యంత పాశ్యవికంగా దాడులకు పాల్పడడం ఎంతవరకు సబబు అని వైఎస్ ఆర్ సి పి రాష్ట్ర పంచాయతీరాజ్ విభాగ ప్రధాన కార్యదర్శి చీర్ల సురేష్ యాదవ్ అన్నారు. గురువారం ఆయన చెన్నూరులో విలేకరులతో మాట్లాడుతూ, ఎమ్మెల్సీ రమేష్ యాదవ్ పై అత్యాయత్నం వైఎస్ఆర్సిపి రాష్ట్ర బీసీ సెల్ అధ్యక్షులు, ఎమ్మెల్సీ రమేష్ యాదవ్ పై కూటమి నాయకులు రాడ్లతో దాడి చేయడం హేయమైన పిరికిపంద చర్యగా ఆయన అభివర్ణించారు. పులివెందుల జడ్పిటిసి ఉపఎన్నికవేళ నల్లగొండువారి పల్లె గ్రామంలో పర్యటించి అక్కడ ప్రచారం నిర్వహిస్తున్న తరుణంలో ఎమ్మెల్సీ రమేష్ యాదవ్, వైయస్సార్ సిపి నాయకుల పై టిడిపి నాయకులు దాడులకు తెగబడడం అదేవిధంగా వారిని తులము ట్టించేందుకు పదక రచన చేయడం బాధాకరమన్నారు. ప్రజాస్వామ్య యుతంగా గెలవలేమని భావించి ఈ విధంగా భయభ్రాంతులకు గురిచేసి కుట్రలు కుతంత్రాలు పని గెలవాలను కోవడం మూర?త్వమని ఇది మంచి పద్ధతి కాదని ఇది ఆటవిక పాలనకు అద్దం పడుతుందని ఆయన కూటమి నేతలకు హితవు పలికారు. ప్రజాస్వామిక బద్ధంగా ఇంటింటికి వెళ్లి ఓటును అర్థిస్తున్న నాయకులను, అడ్డుకునేందుకు అరుపులు, కేకలు వేస్తూ భయభ్రాంతులకు గురి చేస్తూ ఎమ్మెల్సీ రమేష్ యాదవ్ భుజంపై, తలపై విచక్షణారహితంగా దాడి చేయడంతో ఆయనకు తీవ్ర గాయాల కావడం జరిగిందని ఆయన అన్నారు. అలాగే ఆయనకు సంబంధించిన రేంజ్ రోవర్, ఫార్చునర్, స్కార్పియో వాహనాలను సమ్మెటలతో ధ్వంసం చేయడం జరిగిందని తెలిపారు. అంతేకాకుండా ఓ ఇంట్లో వైసిపి నాయకులు ఉన్నారని కారణంగా ఆ ఇంట్లో మహిళలు ఉన్నప్పటికీ ఆ ఇంటిపై పెట్రోల్ పోసి నిప్పట్టించేందుకు టిడిపి మూక విఫలయత్నం చేయడం దారుణమని తెలిపారు. అక్కడ గ్రామస్తులు తిరగబడటంతో కూటమి అల్లరిముకలు వెను తిరిగి వెళ్లడం జరిగిందని ఇంత దారుణంగా రాష్ట్రంలో కూటమి పాలన కొనసాగుతున్నదని ఇది ప్రజాస్వామ్యానికి గొడ్డలివేటుగా ఆయన అభివర్ణించడం జరిగింది. కూటమి నేతలు సార్వత్రిక ఎన్నికల ముందు మేనిఫెస్టోలో పొందుపరిచిన హామీలు అమలు చేయలేకనే ఇలాంటి దౌర్జన్యకాండ కు అరాచకాలకు పాల్పడుతున్నారని ఆయన అన్నారు.

తమ అరాచకాలతో ఎలాగైనా సరే పోలింగ్ రోజున ఓటర్లను పోలింగ్ కేంద్రాలకు రాకుండా చేసి.. ఓటింగ్ క్యాప్చర్ చేసి గెలవాల నే కుతంత్రంతో ఇలా చేయడం జరుగుతుందని ఇదిప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేయడమేనని ఆయన కూటమి వక్రబుద్ధిని ఎండగట్టారు. ప్రజాస్వామ్య పద్ధతిలో శాంతిభద్రతలను పరిరక్షిస్తూ జడ్పిటిసి ఎన్నికలు నిర్వహించే విధంగా రాష్ట్ర ఎన్నికల కమిషన్ తక్షణమే చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు.

## పదవుల కోసం ఓజీలి తెదేపాలో ముష్టి యుద్ధం

**- ఎమ్మెల్యే విజయశ్రీ వేదికపై ఉండగానే రెండు వర్గాలు ఘర్షణ**



**నాయుడుపేట -సూర్యవాస్తవం,ఆగస్టు 7:** గత కొంతకాలం నుంచి ఓజిలి తెలుగుదేశం పార్టీలో పదవుల కోసం పలువురు చోటా నాయకులు కుమ్ములాడు కుంటున్నారన్న విమర్శలు వెలువెత్తుతున్నాయి. మెజారిటీతో గెలిచిన ప్రభుత్వములో షరామావులుగా వచ్చే వర్గ పోరు నాయకత్వం కోసం బాహుబాహికి దిగుతున్నారు. ఈ నేపథ్యంలో గురువారం నాయుడుపేట పట్టణంలోని శ్రీనివాస ఫంక్షన్ హాల్లో జరిగిన ఓజిలి మండలం టీడీపీ కన్వీనర్ ఎంపికలో ముష్టి యుద్ధం చోటు చేసుకుంది. అక్కడ పార్టీ కావాల్సింది నాయకత్వమా..? లేక మరి ఏదైనా ఎవరికి అర్థం కాకుండా ఈ ముష్టి యుద్ధం జరిగినట్లు తెలుస్తుంది.అధిష్టానం గతంలో నిర్ణయం ప్రకటించినట్లు ప్రస్తుతం మండల పార్టీ నాయకులు కార్యకర్తలు అభిమానుల అభిప్రాయం సేకరణ చేయాలని స్థానిక ఎమ్మెల్యే ప్రయత్నించారు. కాగా దుష్ట శక్తులు మధ్యలో ఓజిలి తెదేపాలో వర్గ విభేదాలను ప్రోత్సహించే విధంగా చోటా విభాగం ప్రయత్నించినట్లు పలువురు మండల ప్రజలు ఆరోపిస్తున్నారు.మండలంలో అన్ని గ్రామాలలో దీర్ఘకాలిక సమస్యలు, రైతు సమస్యలు,ఆర్థిక సామాజిక పరమైన అనేక సమస్యలపై పోరాడిన యువ నాయకులు, సీనియర్ నాయకులు పదవుల పై మోజుతో ఎంతో క్రమశిక్షణ కలిగిన తెలుగుదేశం పార్టీని భ్రష్టు పట్టిస్తున్నారని స్థానిక మండల ప్రజలు బాహాటంగా విమర్శించడం విశేషం. ఓజిలి తెలుగుదేశం పార్టీ మండల అధ్యక్ష ఎన్నికలో పోటీ పెరగడంతో సూళ్లూరుపేట నియోజకవర్గంలో అధ్యక్షులు ఎంపిక పార్టీ పరిశీలకులకు కత్తి మీద సాముల మారింది. ఎమ్మెల్యే విజయ శ్రీ వేదికపై ఉండగానే రెండు వర్గాలు ఘర్షణ వాతావరణం కు భయభ్రాంతులకు గురయ్యారు. గన్ మాన్ చాకచక్యంతో ఎమ్మెల్యేని వేదికపై నుంచి తీసుకువెళ్లారు.ఆ ఘర్షణ సమయంలో పోలీసులు లేకపోవడం,పార్టీ వర్గీయులు రెచ్చిపోయి భయానకర వాతావరణం సృష్టించారు.కొంత సమయం తర్వాత సీఐ బాబి, సంగమేశ్వర రావు,ఎస్సైలు ఆదిలక్ష్మి, నాగరాజు లు సమాచారం తెలుసుకొని వెంటనే ఘటనా స్థలానికి చేరుకుని ఇరు వర్గాలను అదుపు చేసి,ఈ సంఘటనకు కారకులైన కోటి, సుధాకర్ లను సీఐ బాబి అదుపులోకి తీసుకొని పోలీస్ స్టేషన్ కు తరలించారు.గత నెల రోజుల క్రితం ఎన్నికలు నిర్వహించిన సమయంలో ఇదే పరిస్థితి నెలకొనడంతో అప్పట్లో పార్టీ అబ్జర్వర్ ఎన్నిక వాయిదా వేసి వెళ్ళిపోవడం జరిగింది.

మళ్లీ అదే పునరావృతం కావడంతో ఓజిలి మండలంలో పార్టీ అధ్యక్ష పదవిని దక్కిం చుకునేందుకు పలు వర్గాలు పావులు కదుపుత "న్నట్లు బహిర్గతం అవుతోంది.ఏది ఏమైనా నియోజకవర్గ ప్రతినిధి ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ మహిళ అను చూడకుండా ఆమె సమక్షంలోనే బాహాబాహీ గా భౌతిక దాడులకు పాల్పడడం తెలుగుదేశం పార్టీ క్రమశిక్షణ రాహిత్యానికి నిదర్శనం అని పార్టీ నాయకులు అంటు న్నారు. ఎమ్మెల్యే డాక్టర్ విజయశ్రీ పార్టీ నిర్ణయాలకు వ్యతిరేకంగా ఎవరైనా ప్రవర్తించిన వారిపై క్రమశిక్షణ చర్యలు ఉంటాయని స్పష్టం చేశారు. ఏది ఏమైనా ఓజీలు తెదేపాలో వర్గ విభేదాలు తారా స్థాయికి చేరాయని మండల ప్రజలు బహటం గానే చెప్పుకుంటున్నారు.

## శ్రీసాయి ఇంజనీరింగ్ కళాశాలలో ట్రీ ప్లాంటేషన్ కార్యక్రమం నిర్వహణ






**అన్నమయ్య బ్యూరో - సూర్య వాస్తవం, ఆగస్టు 7:** అన్నమయ్య జిల్లా కేంద్రం రాయచోటిలోని శ్రీ సాయి ఇంజనీరింగ్ కళాశాలలో పర్యావరణ పరిరక్షణకు ప్రాధాన్యం ఇస్తూ గురువారం నాడు కళాశాల ఎన్ఎస్ఎస్ విభాగం ఆధ్వర్యంలో ట్రీ ప్లాంటేషన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రాంగణంలో మొక్కలు నాటడం జరిగింది. ఈ సందర్భంగా కళాశాల అసిస్టెంట్ డైరెక్టర్ డాక్టర్ ఎం. సుధాకర్ రెడ్డి మాట్లాడుతూ – "పచ్చని చెట్లు ప్రగతికి మెట్లు" అన్న నినాదాన్ని వినిపిస్తూ, చెట్లు నాటడం వలన ఏర్పడే పచ్చదనం, శుద్ధమైన వాయువు, కాలుష్య నివారణ, సమయానికి వర్షాలు, జీవవైవిధ్యం, పర్యావరణ సమతుల్యత వంటి అంశాలను వివరించారు. మానవాళి భవిష్యత్తు హితం కోసమే ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి సంరక్షించాలన్నారు. పారిశ్రామికీకరణ నేపథ్యంలో ప్రభుత్వం అమలు చేస్తున్న రీఫారెస్టేషన్ కార్యక్రమాలలో యువత భాగస్వామ్యం కావాలన్నారు. కళాశాల వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ వి. వెంకటరమణ మాట్లాడుతూ – "చెట్లు నరికితే ఇక్కట్లు, చెట్లుప్రగతికి మెట్లు" అని, ప్రతి విద్యార్థి కనీసం ఒక్క మొక్కను నాటి, దానికి జీవం పోసే బాధ్యత తీసుకోవాలని సూచించారు. ఆక్సిజన్ నిల్వలు పెరిగేలా చేయాలంటే మనందరం కలిసి మొక్కలు నాటి వాటిని పరిరక్షించాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ వి. బాలాజీ, ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ శ్రీ కె. రెడ్డయ్య, వివిధ విభాగాధిపతులు, అధ్యాపకులు, ఎన్ఎస్ఎస్ కమిటీ సభ్యులు, విద్యార్థినీ విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. కార్యక్రమం ముగింపు సందర్భంగా నాటిన మొక్కల సంరక్షణ బాధ్యతను విద్యార్థులే స్వీకరించ గా, ఈ కార్యాచరణ ప్రతి సంవత్సరం చేపట్టాలని ప్రతిజ్ఞ చేశారు. ఈ సందర్భంగా పర్యావరణ పరిరక్షణపై అవగాహన పెంపొందించే ప్రతిజ్ఞను కూడా విద్యార్థులు చేశారు. కార్యక్రమం సజావుగా సాగేందుకు ఎన్ఎస్ఎస్ బృందం ప్రత్యేక కృషి చేసింది.


## తల్లిపాలతోనే సంపూర్ణ ఆరోగ్యం

**- అనంతపురం అర్బన్ సీడీపీఓ అనూరాధ**




**అనంతపురం టౌన్ - సూర్య వాస్తవం, ఆగస్టు 7:** తల్లిపాలతోనే బిడ్డకు సంపూర్ణ ఆరోగ్యం సాధ్యమని ఐసీడీఎస్ అనంతపురం అర్బన్ సీడీపీఓ అనూరాధ అన్నారు. అర్బన్ ప్రాజెక్టులోని ఫస్ట్ సెక్టార్ పరిధిలో గల సునీతా నగర్ లో ఐసీడీఎస్ సూపర్ వైజర్ హేమలత ఆధ్వర్యంలో తల్లిపాల వారోత్సవాలు గురువారం నిర్వహించారు. కార్యక్రమానికి సీడీపీఓ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ... తల్లిపాలు బిడ్డకు వరమని అన్నారు. తల్లిపాలు తాగే బిడ్డలు తెలివిగా ఉంటారని, సంపూర్ణ ఆరోగ్యవంతులుగా తయారవుతారని పేర్కొన్నారు. అమ్మపాలలో ప్రోటీన్లు, కొవ్వులు, ఎంజైములు, విటమిన్లు, ఖనిజాలు, వేలకొద్దీ పోషకాలు ఉంటాయని తెలిపారు. అందుకే ఆర్నెల్ల వరకు పిల్లలకు తల్లిపాలు కచ్చితంగా ఇవ్వాలని వివరించారు. ఆధునిక తల్లులు అందం పోతుందని బిడ్డలకు పాలు ఇవ్వకపోవడం దురదృష్టకరమని ఐసీడీఎస్ సూపర్ వైజర్ హేమలత అన్నారు. ఇదంతా అపోహ మాత్రమేనని తెలిపారు. పాలివ్వడం వల్ల తల్లీ బిడ్డ ఇద్దరూ సంపూర్ణ ఆరోగ్యవంతులుగా ఉంటారని స్పష్టం చేశారు. అనుమానాలు, అపోహలు మాని, ప్రతి తల్లి బిడ్డకు పాలివ్వాలని కోరారు. అనంతరం ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో తల్లులు, అంగన్వాడీ వర్కర్లు పాల్గొన్నారు.

## ప్రజల శ్రేయస్సుకు ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం కృషి



**పామిడి– సూర్య వాస్తవం, ఆగస్టు 7:** గుంతకల్లు నియోజకవర్గం శాసన సభ్యులు గుమ్మనూరు జయరాం నియోజకవర్గం ప్రజలకోసం నిరంతరం కృషి చేస్తున్నారు. పామిడి ప్రభుత్వ ఆసుపత్రి నందు దాదాపుగా సంవత్సరం నుండి బయో కెమిస్ట్రి 25 లక్షల రూపాయల పరికరం పనిచేయడం లేదు. ఈ విషయం పై కమిటీ సభ్యులు చిలకల రాజగోపాల్ ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాంకి తెలపగా ఎమ్మెల్యే జయరాం వెంటనే స్పందించి ఉన్నతాధికారులతో మాట్లాడి ఆ పరికరాన్ని ప్రజలకు వినియోగం లోకి తీసుకురావాలని ఆదేశించారు. అధికారులు స్పందించి గురువారం వచ్చి పరికరాన్ని పరిశీలించి రిపేర్ చేసి ప్రజలకు ఉపయోగించే విధంగా అందుబాటులోకి తీసుకువచ్చారు. ఆసుపత్రి సిబ్బంది, ప్రజలు, కమిటీ ఎమ్మెల్యే .గుమ్మనూరు జయరాం ఆయన తనయుడు యువనేత గుత్తి , పామిడి ఇన్చార్జ్ గుమ్మనూరు ఈశ్వర్ కి కృతజ్ఞతలు తెలిపారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కమిటీ సభ్యులు చిలకల రాజగోపాల్ ఈ సందర్భంగా తెలిపారు.

## యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించడమే ప్రభుత్వ లక్ష్యం

**- ఇన్‌చార్జి జిల్లా కలెక్టర్ శివ్ నారాయణ శర్మ**



**అనంతపురం కలెక్టరేట్ - సూర్య వాస్తవం, ఆగస్టు 7:** రతన్ టాటా ఇన్నోవేషన్ హబ్ ద్వారా యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించడమే ప్రభుత్వలక్ష్యమని ఇంచార్జ్ జిల్లా కలెక్టర్ రతన్ టాటా ఇన్నోవేషన్ హబ్ చైర్మన్ మరియు డైరెక్టర్ శివ్ నారాయణ శర్మ తెలిపారు. గురువారం అనంతపురం జేఎన్టీయూ లో రతన్ టాటా ఇన్నోవేషన్ హబ్ కేంద్రంలో బోర్డు సమావేశం నిర్వహించి పలు అంశాలపై సమీక్షించారు. ఈ సందర్భంగా హబ్ ద్వారా చేపట్టవలసిన పనులపై ముందస్తు ప్రణాళిక రూపొందించేందుకు సలహాలు, సూచనలు ఇవ్వవలసిందిగా బోర్డు సభ్యులను కోరారు. అలాగే ఇన్నోవేషన్ హబ్ మరియు పారిశ్రామిక రంగ అభివృద్ధికి బోర్డ్ డైరెక్టర్లు తగినంతగా సహకరించాలని కోరారు. అనంతరం అజెండా మేరకు పలు అంశాలను చర్చించి ఆమోదించారు. అలాగే హబ్ - స్పోక్ సమావేశంలో ఇంచార్జ్ కలెక్టర్ మాట్లాడుతూ ఇన్నోవేషన్ సెంటర్ నిర్వహణ కోసం కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు సామాజికబాధ్యతకిందపారిశ్రామిక సంస్థల ద్వారా నిధులను సమకూర్చడంజరుగుతుందని తెలిపారు. స్కిల్స్ డెవలప్మెంట్ ఇన్నోవేషన్, స్టార్టప్స్, ఫెసిలిటేషన్ కేంద్రంగా ఈ రతన్ టాటా ఇన్నోవేషన్ హబ్ యువతకు ఎంతగానో దోహద పడనున్నదన్నారు. ముఖ్యంగా యువతకు ఆసక్తి ఉన్న రంగాలలో సరైన దిశా నిర్దేశం చేయడం, వారికితగినసాంకేతికపరిజ్ఞానాన్ని అందించడం ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశమని ఇన్చార్జి కలెక్టర్ పేర్కొన్నారు. అంతేగాక సామాజిక వ్యాపారం, గ్రామీణ ఔత్సాహికమహిళాపారిశ్రామిక వాణిజ్య వేత్తలకు శిక్షణ ఈ కేంద్రంలోనిర్వహిస్తున్నట్లు తెలిపారు. అలాగే స్టార్టప్లను ఏర్పాటు చేసి ఇందులో తయారీ సాంకేతిక వ్యవసాయ అనుబంధ రంగాలు, సోలార్ ఎనర్జీ ఇండస్ట్రీలలో ఎక్కువగా యువతకుఉపాధి అవకాశాలు లభించే అవకాశాలు ఉంటుందన్నారు. ఈ స్టార్టప్ నుండి నిర్దేశించి నపెట్టుబడులు సమీకరిస్తూ మహిళలకు, యువతకు నైపుణ్యం కలిగిన వారికి ప్రాధాన్యం కల్పించడం జరుగుతుందన్నారు. స్టార్ట్ ప్ లతో రానున్న రోజుల్లో వేలాది ఉద్యోగాలను కల్పించాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకున్నట్లు ఇన్‌చార్జ్ కలెక్టర్ పేర్కొన్నారు. ఉమ్మడి అనంతపురం జిల్లాలో ఒక స్టార్టప్ నెలకొల్పడం వల్ల ఈ హబ్ కీలక పాత్ర పోషిస్తుందని భావించాలన్నారు. ప్రస్తుతం శాశ్వతప్రాంగణంఅందుబాటులోకి వచ్చేంత వరకు మౌలిక వసతులు కల్పించేందుకు కార్యకలాపాలు పూర్తి స్థాయిలో ప్రారంభమయ్యేలా చూడడంపై దృష్టి సారిస్తున్నట్లు తెలిపారు. ఈ విషయంలో ఇన్నోవేషన్ టాస్క్ఫోర్స్‌గా బోర్డ్ డైరెక్టర్లు సంపూర్ణ సహకారాలు అందించాలని కోరారు. ప్రస్తుతం పలు పారిశ్రా మిక వేత్తల ద్వారాఆయా పరిశ్రమలు ప్రమోటర్లుగా సహకారాలు అందించాలన్నారు. అంతకుముందు భవి ష్యత్తు ప్రణాళికలో భాగంగా సీఈఓ తదితర ఉద్యోగ సిబ్బంది నియామకాలు, ఆర్థిక వనరుల సేకరణ, వ్యయ ఖర్చులు, ల్యాబ్ లు ఏర్పాటు తదితర అంశాలపై చర్చించారు. అలాగే ఉమ్మడిజిల్లాలోఉన్నజేఎన్టీయూ అనుబంధ ఇంజనీరింగ్ కళాశాలలో ఉన్న విద్యార్థులకు రతన్ టాటా ఇన్నోవేషన్ హబ్ పై అవగాహన కార్యక్రమాల చర్యలు తీసుకోవడంపై నిర్ణయించి సమావేశంలో ఆమోదించారు. ఈ కేంద్రంలో ఔత్సాహిక పారిశ్రామికవేత్తలకు, కళాశాలల విద్యార్థులకు సలహాలు, సూచనలు అందించేందుకు సచివాలయ సిబ్బందిని ఉపనియామకాలు చేసుకొని వారికి శిక్షణ ఇచ్చి ఇన్నోవేషన్ హబ్ పై అవగాహన కల్పించే విధంగా ఏర్పాటుచేసుకున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో అడిషనల్ బోర్డు డైరెక్టర్లు కనకారావు, పి. కె. మురు గన్( జే ఎస్ డబ్ల్యూ) అనంతపురం జేఎన్టీయూ కళాశాల ప్రిన్సిపల్ చెన్నారెడ్డి, కేంద్రీయ విశ్వవిద్యాలయం కివాడే, యోగేష్ ఇందివర్ (భారత్ ఫోర్జ్) నవీన్ శర్మ (రేమండ్) స్కిల్ డెవలప్మెంట్ నోడల్ అధికారి ప్రతాపరెడ్డి, కంపెనీ సెక్రటరీ వెంకటేష్ దబ్బర, జిల్లా పరిశ్రమల శాఖ జనరల్ మేనేజర్ శ్రీనివాస్ యాదవ్, కియా ప్రతినిధి సోమశేఖర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## 12వ మహాసభలతో ఎరుపెక్కిన పురవీధులు

**- స్మార్ట్ మీటర్ల వద్దు పాత మీటర్లు ముద్దు**

**- శిథిలావస్థలో ఉన్న టిడ్కో భవనాలను రద్దుచేసి వాటి బదులు నివేశ స్థలాలు మంజూరు చేయండి**




**పామిడి– సూర్య వాస్తవం, ఆగస్టు 7 :** భారత కమ్యూనిస్టు పార్టీ(సిపిఐ) దేశంలో 100 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా గురువారం పామిడి పట్టణంలోని షాదీఖానా లో 12వ మండల మహాసభలను సిపిఐ పార్టీ నాయకులు ఘనంగా నిర్వహించారు. ఆర్టీసీ బస్టాండ్ ఆవరణం నుంచి షాదిఖానా వరకు పురవీధుల గుండా భారీగా ర్యాలీ నిర్వహించారు. అనంతరం షాదీఖానాలో ఏర్పాటు చేసిన బహిరంగసభలో సిపిఐ పార్టీ జిల్లా సహాయ కార్యదర్శి నారాయణస్వామి సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు గోవిందు గుంతకల్ సీపీఐ నియోజకవర్గం కార్యదర్శి వీరభద్రస్వామి, సహాయ కార్యదర్శి మహేష్ మండల నాయకులు కే. రహీం,నాగరాజు వేదికపై నుంచి మాట్లాడుతూ దేశంలో ప్రజాస్వామ్య పాలన అంతరించి పోయినదని పారిశ్రామిక వేత్తల చేతులకు వెళ్లిందన్నారు. ఆదాని ఆదాయం, ఆనందం కోసం గతంలో జగన్మోహన్ రెడ్డి 1750 కోట్లు లంచం రూపంలో అమ్ముడుపోయారని, వాటి పరిణామం వల్ల స్మార్ట్ మీటర్లతో బడుగు, బలహీన వర్గాల ప్రజలు బిల్లుల మోతలు మోయలేకున్నారన్నారు. కూటమి ప్రభుత్వం మతోన్మాదంతో పైశాచిక ఆనందం పొందుతూ ఉందన్నారు. సామ్రాజ్యవాదం భూస్వామ్య విధానాలకు వ్యతిరేకంగా పేద బడుగు బలహీన వర్గాల పీడిత ప్రజల కోసం ఆవిర్భవించినదని, నాటి నుండి నేటి వరకు కార్మిక కర్షక వర్గాల ప్రయోజనాల కోసం అలుపెరుగని పోరాటాలు నిర్వహిస్తున్నాదని, దళిత గిరిజన మైనార్టీల బలహీన వర్గాల వారి హక్కుల రక్షణ కోసం వారి ప్రయోజనాల పరిరక్షణ కోసం నిర్విరామంగా కృషి చేస్తూనే ఉన్నది అన్నారు. స్వాతంత్రం అనంతరం భూసంస్కరణ అమలు కోసం పెద్ద ఎత్తున ఉద్యమాలు నిర్వహించినదని, మతోన్మాదం ప్రజా వ్యతిరేక విధానాలకు సిపిఐ పార్టీ వ్యతిరేకమన్నారు.

రాష్ట్ర కూటమి ప్రభుత్వ పాలనలో ఇసుక మద్యం మైనింగ్ గ్యాంబ్లింగ్ మైనింగ్ మాఫియాలకు వ్యతిరేకంగా ఆందోళనలో నిర్వహిస్తూ ప్రజాస్వామ్య హక్కుల పరిరక్షణ కోసం పోరాడుతూనే ఉన్నామని, పోరాటాల్లో భాగంగా అగ్రిగోల్డ్ బాధితులకు న్యాయం పోరాడి విజయం సాధించామని అలాగే టిడ్కో ఇల్లు లబ్ధిదారులకు నిర్మాణం పూర్తి చేసి వారికి కేటాయించాలని లేనిపక్షంలో వాటిని రద్దుచేసి అర్హులైన ప్రతి ఒక్కరికి మూడు సెంట్లు చొప్పున నివేశ స్థలం మంజూరు చేయాలని, ఇంటి నిర్మాణం కోసం వారికి ఐదు లక్ష రూపాయలు మంజూరు చేయాలని పెరిగిన పెట్రోల్ డీజిల్ గ్యాస్ విద్యుత్ చార్జీలపై వ్యతిరేకంగా రాజీలేని పోరాటాలు చేస్తున్నామని, దేశంలో అక్రమ కేసులకు అరెస్టులకు నిర్బంధాలకు జైలు జీవితాలకు భయ పడకుండా ప్రజల సమస్యలపై ఉద్యమాల రూపంలో ఎదురొడ్డి నిలుస్తున్నామని ఆయన తెలిపారు. స్వాతంత్రం వచ్చిన తర్వాత పార్లమెంటులో సిపిఐ పార్టీ ప్రధాన ప్రతిపక్ష పాత్ర పోషించిందన్నారు.

సిపిఐ పార్టీ ప్రజల పార్టీ మూడు సంవత్సరములకు ఒకసారి ప్రజాస్వామ్య బద్దంగా గ్రామస్థాయి నుండి రాష్ట్ర జాతీయ స్థాయి వరకు మహాసభలు జరుపుకోవాలని అలవాయితీ అన్నారు. పామిడి పట్టణంలో గత కొన్ని ఏళ్లుగా మూతబడిన చేనేత జౌళి శాఖ టెక్స్టైల్ పార్క్ వెంటనే చదవాలని, ఆర్టీసీ బస్టాండ్ అభివృద్ధి చేపట్టాలని, వ్యవసాయ కూలీలకు పలులు కల్పించాలని, త్రాగునీటి సమస్య పరిష్కరి ంచా లని, పెండింగ్ లో ఉన్న వాటర్ ట్యాంక్ నిర్మాణం పూర్తి చేయాలని, పాములు పట్టణంలో సిసి రోడ్లు డ్రైనేజీ కాలువలు నిర్మించాలని ప్రతి నెల పెంచుతున్న సర్దుబాటు విద్యుత్ చార్జీలను వెంటనే విరమించుకోవాలని, ఆధార్ కేంద్రంలో ఏర్పాటు చేయాలని వీటన్నిటి పైన మరింతగా పోరాటాలు చేస్తామని ఆయన పేర్కొన్నారు. నేటి మహాసభలకు సిపిఐ జిల్లా రాష్ట్ర నాయకులు హాజరు కాబోతున్నారని కావున ప్రతి ఒక్కరూ హాజరై సభలను జయప్రదం చేయవలసిందిగా ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో కె రహీం నాగరాజు చౌడప్ప ఇమామ్ కోదండరామిరెడ్డి, లోకేష్ రాముడు, తదితరులు పాల్గొన్నారు.

## రైతుల నుండి బొప్పాయి కిలో రూ.9లకు తగ్గకుండా కొనాలి

**- తక్కువగా రైతుల నుండి కొంటే వ్యాపారస్తులపై తగిన చర్యలు**

**- రాజంపేట సబ్ కలెక్టర్ భావన**



**అన్నమయ్య బ్యూరో - సూర్య వాస్తవం, ఆగస్టు 07 :** బొప్పాయి రైతుల నుండి బొప్పాయి కిలో తొమ్మిది రూపాయలకు తగ్గ కుండా కొనాలని అంతకు తక్కువగా రైతుల నుండి కొంటె వ్యాపారస్తులపై తగిన చర్యలు తీసుకుంటామని రాజంపేట సబ్ కలెక్టర్ భావన ఆదేశాలు జారీ చేశారు. జిల్లా కలెక్టర్ శ్రీధర్ చామకూరి ఆదేశాల మేరకు రాజంపేట సబ్ కలెక్టర్ భావన రాజంపేట ఏ ఎస్ పి మనోజ్ రామనాథ్ హెగ్డే, జిల్లా ఉద్యానవన శాఖ అధికారి సుభాషిని కోడూరు తాసిల్దారు అమర్నాథ్ లతో కలిసి గురువారం సాయంత్రం బొప్పాయి రైతుల సమస్యలపై వ్యాపారస్తులు దళారులు సప్లయర్లతో సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా రాజంపేట సబ్ కలెక్టర్ మాట్లాడుతూ ఈనెల 1న జిల్లా కలెక్టర్ బొప్పాయి వ్యాపారస్తులతో సమావేశాన్ని నిర్వహించి ఆగస్టు 6 నుండి బొప్పాయి కిలో పది రూపాయలకు తగ్గకుండా కొనే విధంగా ఒప్పించడం జరిగిందన్నారు. అయితే బొప్పాయి వ్యాపారస్తులు దళారులు తదితరులు కిలో 08 రూపాయలకు తగ్గించి కొంటున్నారని ఇది రైతులకు చాలా నష్టదాయకంగా ఉంటుందన్నారు. బొప్పాయి కిలో 09 రూపాయలకు తగ్గకుండా కొనాలని అలా కొనకపోతే తగిన చర్యలు తీసుకుంటామన్నారు. చెక్ పోస్టుల దగ్గర వీఆర్వో వి హెచ్ ఓ ట్రాన్స్పోర్ట్ శాఖ సిబ్బంది తదితరులతో కూడిన బృందాలను ఏర్పాటు చేసి లారీలలో వెళ్లే బొప్పాయి 09 రూపాయలకు తగ్గకుండా కొంటున్నారో లేదో తనిఖీ నిర్వహించి పంపాలని రాజంపేట పోలీస్, తహసిల్దార్, తదితర అధికారులను ఆదేశించారు.

# పట్టణాభివృద్ధికి ప్రజల సహకారం అవసరం

## -ఎమ్మెల్యే కందికుంట



**కదిరి – సూర్య వాస్తవం, ఆగస్టు 7 :** కదిరి పట్టణం అభివృద్ధి చెందాలంటే పట్టణ ప్రజల సహకారం చాలా అవసరమని ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ పేర్కొన్నారు. మదనపల్లి రోడ్డు లోని హిందూపురం రోడ్డు వైపుకు వెళ్లే బైపాస్ రోడ్డు ను ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కదిరి పట్టణంలో ప్రజలు వ్యాపారస్తులు ట్రాఫిక్ అంతరాయంతో ఇబ్బంది పడుతున్న నేపథ్యంలో బైపాస్ రోడ్డు నిర్మాణం చేపట్టడం జరిగిందన్నారు. కేంద్ర ప్రభుత్వ సహకారంతో కూటమి ప్రభుత్వంలో ఎన్నోఅభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలకు శ్రీకారం చుట్టిన అనంతరం కదిరి బైపాస్ రోడ్డు నిర్మాణం ఒక సవాలుగా నిలిచిందన్నారు. అన్నిటినీ అధిగమించి బైపాస్ రోడ్డు ప్రారంభం కానున్న నేపథ్యంలో ప్రజలు సుఖంగా, సంతోషంగా, ప్రయాణాలను కొనసాగించాలని కోరారు. పట్టణంలో ఆర్టీసీ బస్సుల రాకపోకలను నిలిపివేయడం వల్ల కొద్దిరోజులు ప్రజలకు ఇబ్బంది ఉంటుందనే విషయం నాకు కూడా తెలుసని అయితే అందుకు ప్రత్యేకంగా పట్టణంలో ప్రజల సౌకర్యం కోసం దేవాదాయ శాఖ సహకారంతో రెండు ఎలక్ట్రిక్ బస్సులను తీసుకురావడానికి కూడా కృషి చేస్తామన్నారు. ఈ బస్సులు బైపాస్ రోడ్ లో నుంచి పట్టణంలోకి వచ్చే ప్రయాణికుల సౌకర్యం ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీల మేరకు ఒక్కొక్కటి నెరవేరుస్తూ అభివృద్ధి దిశగా దూసుకుపోతుందని తెలియజేశారు, రాబోవు రోజుల్లో మహి ళలకు ఉచిత బస్సు ప్రయాణంలో భాగంగా మహిళలకు మరిన్ని సౌకర్యాలు ఏర్పాటు చేయడానికి చర్యలు తీసుకుంటుందని తెలిపారు, ఉచిత బస్సు ప్రయాణం ద్వారా అనేక ఇబ్బందులు నెలకుంటాయని వాటి ద్వారా ఆటో వాహనదారులు ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటారని ఉద్దేశంతో వస్తున్న అపోహలకు స్పందిస్తూ రానున్న రోజుల్లో వారికి మరిన్ని వెసుల బాటు కల్పించే విధంగా ప్రభుత్వం చర్యలు తీసుకునే విధంగా జరుగుతుందని తెలియజేశారు, సామాన్య ప్రజలకు, చేనేత కార్మికులకు, చేతివృత్తి కార్మికులకు, ఉచిత విద్యుత్తునందిస్తూ చర్యలు చేపట్టిన రాష్ట్ర ప్రభుత్వం వారి అభివృద్ధికి వెన్నుదన్నుగా ఉంటూ వారి కష్టాల్లో పాలు పంచుకుంటుందని తెలియజేశారు, ఈ కార్యక్రమంలో రాష్ట్ర తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి పవన్ కుమార్ రెడ్డి, బిజెపి యువ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు మిట్ట వంశీ కృష్ణ, దళిత మోర్చా నాయకులు తలుపుల గంగాధర డి.ఎస్.పి శివ నారాయణ స్వామి, మున్సిపల్ కమిషనరు కిరణ్ కుమార్ ,సిఐ లు నారాయణరెడ్డి, నిరంజన్ రెడ్డి, నాగేంద్ర పట్టణ ఎస్సై బాబ్ జాన్, తెలుగుదేశం పార్టీ నాయకులు బహావుద్దీన్, పట్టణ తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు డైమండ్ ఇర్ఫాన్, మున్సిపల్ వైస్ చైర్ పర్సన్ రాజశేఖర్ ఆచారి, బాబయ్య, అనిల్ కుమార్ రెడ్డి పాల రమణ, ఇలాహి, మున్సిపల్ కౌన్సిలర్ లు, మహిళా నాయకురాలు ప్రేమలత, సుశీల, తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు, ప్రభుత్వ అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# ఆగిన డిజిటల్ సేవలు...!

- డిజిటల్ అసిస్టెంట్ లేక ఇబ్బందుల్లో గ్రామ ప్రజలు
- మిగతా గ్రామ సచివాలయాల ద్వారా అరకొరా సేవలు పొందుతున్న ప్రజలు
- ససేమీరా చెయ్యలేము అంటున్న మిగతా సచివాలయాల డిజిటల్ అసిస్టెంట్లు






**కనేకల్ – సూర్య వాస్తవం ఆగస్టు 7 :** ఫ్రంట్ ఆఫీస్ రిసెప్షనిస్ట్‌గా ప్రజలకు సేవలు అందించాల్సిన డిజిటల్ అసిస్టెంట్ లేక పోవడంతో ప్రజల డిజిటల్ సేవలకు త్రివరమైన ఆటంకం కలిగిన సంఘటన కనేకల్ మండలం లో చోటుచేసుకుంది. కనేకల్ పట్టణంలో మేజర్ గ్రామపంచాయతీ పరిధిలో మొదటి సచివాలయంలో డిజిటల్ అసిస్టెంట్ లేక ప్రజలకు ప్రభుత్వం ద్వారా అందించే డిజిటల్ సేవలు తాత్కాలికంగా నిలిచిపోయాయి. గత కొన్ని రోజుల్లో జరిగిన బదిలీల్లో భాగంగా మొదటి సచి వాలయంలో ఉన్న డిజిటల్ అసిస్టెంట్ వేరే ప్రాంతానికి బదిలీ కావడంతో ఇక్కడ ప్రజల సేవలకు ఆటంకం ఏర్పడింది. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగాకుండా కనేకల్ మేజర్ గ్రామ పంచాయితీ కార్యదర్శి ఎల్.వి. ప్రసాద్ ప్రజలు డిజిటల్ సేవల ను మిగతా గ్రామ సచివాలయాల ద్వారా పొందుతున్నారు అని అన్నారు. పని ఒత్తిడి పెరగడంతో ససే మీరా అంటున్న పట్టణంలోని మిగతా సచివాలయాల డిజిటల్ అసిస్టెంట్లు. పట్టణంలోని రెండు మూడు నాలుగు సచివాలయాల డిజిటల్ అసిస్టెంట్ల ద్వారా సేవలను పొందుతున్నారు అయితే కొంతమంది డిజిటల్ అసిస్టెంట్లు మా సచివాలయం సర్వీసులే! ఎక్కువ ఉన్నాయి మరియు మా పరిధిలోకి రాదు అని అంటున్నారు అని దీనిపై సంబంధిత అధికారులు స్పందించాలని ప్రజలు కోరుతున్నారు.

**వివరణ :** కనేకల్ మేజర్ పంచాయతీ కార్యదర్శి ఎల్వి ప్రసాద్‌ను సూర్య వాస్తవం రిపోర్టర్ వివరణ అడగగా ప్రజలు పడుతున్న సమస్యల గురించి ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లామని తెలియజేశారు.

# అహుడ పెండింగ్ పనులను వెంటనే పూర్తి చేయాలి

## - ఇన్‌చార్జి జిల్లా కలెక్టర్ శివ్ నారాయణ శర్మ



**అనంతపురం కలెక్టరేట్ – సూర్య వాస్తవం, ఆగస్టు 07 :** అనంతపురం, హిందూపురం పట్టణాభివృద్ధి సంస్థ పరిధిలో ఉన్న ఎంఐజి లేఅవుట్ల పెండింగ్ పనులను సత్వరమే పూర్తి చేయాలని ఇన్‌ఛార్జి జిల్లా కలెక్టర్ శివ్ నారాయణ శర్మ ఆదేశించారు. గురువారం తన క్యాంపు కార్యాలయంలో అహుడా చైర్మన్ టి. సి.వరుణ్ తో కలిసి సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఉమ్మడి జిల్లాలో వివిధ ప్రాంతాలలో ప్రస్తుతం జరుగుతున్న లేఅవుట్ల అభివృద్ధికి సంబంధించి పలు విషయాలపై ఆరా తీశారు. అనంతరం ఇన్చార్జి కలెక్టర్ మాట్లాడుతూ.... ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం మధ్యతరగతి ప్రజల సమస్యలను దృష్టిలో ఉంచుకొని వివిధ పట్టణాలలో ప్రణాళిక బద్ధంగా సరసమైన ధరలకు టైటిల్ తో కూడిన రెసిడెన్షియల్ ప్లాట్లు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకుందని తెలిపారు. ముఖ్యంగా ప్రజల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకొని ప్రణాళిక బద్ధంగా ఎన్టీఆర్ స్మార్ట్ టౌన్షిప్ ద్వారా ఎంఐజి లేఅవుట్లను అహుడా ద్వారా చేపట్టాలని సూచించారు. ముఖ్యంగా మౌలిక సదుపాయాల కల్పనలో నాణ్యత ప్రమాణాలను పాటించాలన్నారు. ఇటీవల ప్రభుత్వం జీవో నెంబర్ 148 ద్వారా ఎన్టీఆర్ స్మార్ట్ టౌన్షిప్ కింద ఉన్న ఎంఐజి లేఅవుట్ లకు సంబంధించి కొన్ని మార్గదర్శకాలు జారీ చేసినట్లు పేర్కొన్నారు. ఇందులో భాగంగా ప్రస్తుతం లాంచ్ కాబడిన ఎంఐజి లేఅవుట్లలో ఇప్పటివరకు కేటాయించని ప్లాట్లను కమర్షియల్ యాక్షన్ విధానంలో అమ్మడానికి మరియు అనే రకాల ఆదాయ వర్గాల వారికి అలాగే ఒకే కుటుంబంలో ఎంతమందికైనా ప్లాట్లు కొనుటకు వెసులుబాటు కల్పించడం జరిగిందని ఇన్చార్జి కలెక్టర్ తెలిపారు. తద్వారా మరిన్ని నిధులు సమకూరి త్వరితగతిన లేఔట్లలోని మౌలిక సదుపాయాలను నాణ్యత ప్రమాణాలతో ఏర్పాటు చేయుటకు అవకాశం ఉందన్నారు. అనంతపురం, రాప్తాడు అసెంబ్లీ నియోజకవర్గంలో ని లేఅవుట్లు, ఉరవకొండ అసెంబ్లీ నియోజకవర్గంలోని లేఔట్లలో పెండింగ్ పనులను పూర్తి చేయాలన్నారు. బుకింగ్ కానీ ప్లాట్లకు త్వరలో కమర్షియల్ యాక్షన్ విధానంలో అమ్మడానికి ప్రణాళికలు రూపొందించాలని సూచించారు.

గుంతకల్ గుత్తి లేఅవుట్ లో అనంతపురం రూరల్ మండలంలోని రాజన్న పల్లి రాయదుర్గం నియోజకవర్గం మరియు కళ్యాణదుర్గం నియోజకవర్గం తడకలేరు తదితర ప్రాంతాలలో కమర్షియల్ ,మల్టీప్లెక్స్ కాంప్లెక్స్ కన్వెన్షన్ హాల్ అభివృద్ధి పనుల కు సంబంధించి చర్యలు తీసుకోవాలని ఇన్చార్జ్ కలెక్టర్ ఆదేశించారు. ఈ సమావేశంలో అహుడా సెక్రెటరీ రామ కృష్ణారెడ్డి, ప్లానింగ్ అధికారి ఇషాక్, ఇంజనీరింగ్ విభాగం అధికారులు దుష్యంత్,హరీష్, రేవంత్ ప్రసాద్ రమేష్ తదితరులు పాల్గొన్నారు.

# జడ్పీటీసీ ఉప ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థిని గెలిపించండి

## - అన్నమయ్య డీసీసీ జనరల్ సెక్రటరీ అమీర్



**రాయచోటి–సూర్య వాస్తవం, ఆగస్టు 7 :** ఒంటిమిట్ట జడ్పీటీసీ ఉప ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి పూల భాస్కర్‌ని అత్యధిక మెజారిటీతో గెలిపించాలని అన్నమయ్య డిసిసి జనరల్ సెక్రటరీ అమీర్ ఓటర్లను కోరారు. జడ్పిటిసి ఉప ఎన్నికల్లో మండల కేంద్రం ఒంటిమిట్ట లోని పలు వీధులలో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి పూల భాస్కర్ తరపున ప్రచారం చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడుతూ టిడిపి వైకాపా అధికారం కోసం ప్రాకులారడం తప్ప మండల స్థాయిలో వివిధ రంగాలలో అభివృద్ధి సాధించాలన్న పట్టుదల ఆ పార్టీలకు లేదన్నారు. వ్యవసాయం, విద్య, ఆరోగ్యం, మౌలిక సదుపాయాలు, సామాజిక అభివృద్ధి చెందాలంటే కాంగ్రెస్ పార్టీ తోనే సాధ్యమని ఆయన అన్నారు. రైతుల ఆదాయాన్ని పెంచడానికి, వ్యవసాయ ఉత్పాదకతను పెంచడానికి చర్యలు తీసుకోవడం. ఆధునిక సాగు పద్ధతులను ప్రోత్సహించడం, నీటి వనరులను సమర్ధవంతంగా ఉపయోగించడం, పంటల వైవిధ్యీకరణను ప్రోత్సహించడం కాంగ్రెస్ పార్టీకి వెన్నతో పెట్టిన విద్య అన్నారు. ఆరోగ్య సంరక్షణ సేవలను మెరుగుపరచడం. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను బలోపేతం చేయడం, వైద్య సిబ్బందిని నియమించడం, వ్యాధుల మౌలిక సదుపాయాలు, మండలంలో రోడ్లు, విద్యుత్, నీటి సరఫరా వంటి మౌలిక సదుపాయాలను మెరుగుపరచడంలో కాంగ్రెస్ పార్టీ ఎప్పుడు ముందు ఉంటుందన్నారు. మండల అభివృద్ధికి కాంగ్రెస్ పార్టీ భరోసా ఇస్తుందన్నారు. ఈ జెడ్పిటిసి ఉప ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిని అత్యధిక మెజార్టీతో గెలిపించాలని ఓటర్లను కోరారు. ఈ ఎన్నికల ప్రచార కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి పూల భాస్కర్, రాయచోటి పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు బాబా సర్దార్, మహిళ నాయకురాలు విజయ, తదితరులు పాల్గొన్నారు.



# ప్రజలు సంతృప్తి చెందేలా అధికారులు, సిబ్బంది సేవలందించాలి

## - జిల్లా సంయుక్త కలెక్టర్ ఆదర్శ రాజేంద్రన్



**అన్నమయ్య బ్యూరో– సూర్య వాస్తవం, ఆగస్టు 7:** ప్రజలందరూ సంతృప్తి చెందేలా అధికారులు, సిబ్బంది సేవలందించాలని, జిల్లా సంయుక్త కలెక్టర్ ఆదర్శ రాజేంద్రన్ అధికారులను ఆదేశించారు. గురువారం సాయంత్రం అమరావతిలోని సచివాలయం నుండి రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి విజయానంద్..... స్వర్ణాంధ్ర–పి–4 కార్యక్రమం, ఐ విఆర్ఎస్ ద్వారా ప్రజల నుండి అభిప్రాయాల సేకరణ, తదితర అంశాలపై అన్ని జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. రాయచోటి కలెక్టరేట్ లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుండి జిల్లా సంయుక్త కలెక్టర్ ఆదర్శ రాజేంద్రన్, డిఆర్ఓ మధుసూదన్ రావు , వివిధ శాఖల జిల్లా అధికారులు హాజరయ్యారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి మాట్లాడుతూ.... రాష్ట్ర ముఖ్యమంత్రివర్యులు నారా చంద్రబాబు నాయుడు గారు పి 4 కార్యక్రమాన్ని ఎంతో ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్నారని మార్గదర్శి బంగారు కుటుంబాలను మ్యాప్ చేసే ప్రక్రియను వేగవంతం చేసి ఆగస్టు 15 కల్లా పూర్తయ్యేలా చూడాలన్నారు. ప్రజల నుండి అభిప్రాయాలను సేకరించిన వాటిపై ప్రభుత్వ ఆసుపత్రులలో వైద్య సేవలు పాస్ బుక్ సర్వే వంటి అంశాలలో ప్రజలందరూ సంతృప్తి చెందేలా చర్యలు తీసుకోవాలన్నారు. పి పి పి మార్గంలో రాష్ట్రంలో మౌలిక సదుపాయాల కల్పనకు జిల్లా కలెక్టర్లు అందరూ చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ప్రతి నియోజకవర్గంలో ఒక ఎం ఎస్ ఎం ఏర్పాటుపై పెండింగ్ పనులను పూర్తి చేయాలన్నారు. అనంతరం జిల్లా సంయుక్త కలెక్టర్ ఆదర్శ రాజేంద్రన్, రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఇచ్చిన సూచనలు మేరకు సంబంధిత శాఖల వారు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.



# రీసర్వే భూ సమస్యలు పరిష్కరించండి: ఆర్డీఓ



**రాప్తాడు – సూర్య వాస్తవం, ఆగస్టు 7:** భూములు రీ సర్వే చేసినప్పుడు భారీగా అవకతవకలు జరిగాయని మండల కన్వీనర్ పంపు కొండప్ప కార్యదర్శి దగ్గుబాటి శ్రీనివాసులు పేర్కొన్నారు.రాప్తాడు మండల కేంద్రంలోని తాసిల్దార్ కార్యాలయం నందు అనంతపురం ఆర్డీఓ కేశవ నాయుడుకు రీసర్వేలో జరిగిన భూ సమస్యలు పరిష్కరించాలని వినతిపత్రం అందజేశారు. ఈ సంధర్భంగా మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వ హయాంలో జరిగిన భూమి రీ సర్వేలో మండల సర్వేయర్ ఏకపక్షంగా వ్యవహరించి భారీగా అవకతవకలకు చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. ముఖ్యంగా గాండ్లపర్తి కొత్తపల్లి బొమ్మేపర్తి రెవెన్యూ పొలాల్లో భూమి సమస్యలు ఎక్కువగా ఉన్నాయన్నారు.రైతుల ప్రతిరోజు సచివాలయాల చుట్టూ తిరుగుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. న్యాయబద్ధంగా కొలతలు వేసి రైతులకు న్యాయం చేయాల్సిన ప్రభుత్వ అధికారులే రైతులను ఇబ్బంది పెట్టి గ్రామాల్లో కక్షలకు దారి తీసే విధంగా రీ సర్వే చేశారన్నారు.

రీసర్వేలో జాయింట్ ఎల్ పిఎంల సమస్యలు కూడా ఎక్కువగా ఉన్నాయన్నారు. రాజకీయ నాయకులకు రాజకీయ పార్టీలకు భయపడకుండా న్యాయబద్ధంగా రైతుల భూ సమస్యలు పరిష్కరించాలని కోరారు. ఆర్డీవో సానుకులంగా స్పందించి తాసిల్దార్ విజయ్ కుమారి, సర్వేయర్‌తో చర్చించారు. త్వరగా భూ సమస్యలు పరిష్కరించాలని ఆదేశించారు.సోమర నారాయణస్వామి టిడిపి నాయకులు రైతులు ఉన్నారు.

### రికార్డ్ సృష్టించిన

# ఓజీ ఫైర్ స్టోర్మ్.. పవనా.. మజాకా!

**ఇదిలా ఉంటే తాజాగా విడుదలైన ఓజీ ఫైర్ స్టోర్మ్ సాంగ్ స్పాటిఫై లో రికార్డు సృష్టించింది.**

పవర్ స్టార్ పవన్ కళ్యాణ్ నటించిన హరిహర వీరమల్లు విడుదలవ్వడంతో ప్రస్తుతం అభిమానుల ఆశలన్నీ ఓజీ సినిమాపైనే ఉన్నాయి. సాహో మూవీ డైరెక్టర్ సుజీత్ దర్శకత్వం వహిస్తున్న ఓజీ మూవీపై అభిమానుల్లో భారీ అంచనాలు ఉన్నాయి. అటు పవన్ కళ్యాణ్ నుంచీ వస్తున్న మరో సినిమా ఉస్తాద్ భగత్ సింగ్ కూడా విడుదలకు సిద్ధంగా ఉన్నప్పటికీ.. పవన్ అభిమానుల ఆసక్తి మొత్తం ఓజీ సినిమా పైనే ఉండడం గమనార్హం. పైగా ఓజీ సినిమా ఎప్పుడెప్పుడు థియేటర్లలో విడుదలవుతుందా అని ఎంతో మంది అభిమానులు ఈగర్‌గా వెయిట్ చేస్తున్నారు. ఇప్పటికే ఓజీ సినిమా రిలీజ్ డేట్‌ని కూడా అఫీషియల్‌గా ప్రకటించారు మేకర్స్. ఈ సినిమా సెప్టెంబర్ 25న థియేటర్లలోకి రాబోతున్నట్టు క్లారిటీ ఇచ్చారు. ఇదిలా ఉంటే తాజాగా విడుదలైన ఓజీ ఫైర్ స్టోర్మ్ సాంగ్ స్పాటిఫైలో రికార్డు సృష్టించింది. ఏకంగా స్పాటిఫైలో ఫైర్ స్టోర్మ్ అలాంటి రికార్డు క్రియేట్ చేయడంతో ఈ విషయాన్ని అభిమానులతో అఫీషియల్‌గా పంచుకున్నారు సోనీ మ్యూజిక్ అది నేతలు. ఇక విషయంలోకి వెళ్తే.. డీవీవీ ఎంటర్టైన్మెంట్స్ బ్యానర్‌లో తెరకెక్కుతున్న ఓజీ మూవీని డీవీవీ దానయ్య నిర్మిస్తున్నారు. అయితే ఈ సినిమా నుంచీ రీసెంట్ గా 'ఫైర్ స్టోర్మ్' అనే ఫస్ట్ సింగిల్‌ని రిలీజ్ చేశారు చిత్ర యూనిట్. ఈ సాంగ్ ఇప్పుడు స్పాటిఫైలో దుమ్ము రేపుతోంది. ఫైర్ స్టోర్మ్ సాంగ్ స్పాటిఫై లో ఊహించని రికార్డు క్రియేట్ చేసింది.

అదేంటంటే స్పాటిఫై లో అత్యంత వేగంగా1 మిలియన్‌కి చేరుకున్న పాటగా ఓజీ మూవీలోని ఫస్ట్ సింగిల్ ఫైర్ స్టోర్మ్ రికార్డు క్రియేట్ చేసింది. దీంతో ఓజీ మూవీ పైనే కాదు.. ఇందులో నుండి విడుదలయ్యే పాటలకు కూడా ఎలాంటి హైప్ ఉందో ఈ ఒక్క విషయంతో అర్థం చేసుకోవచ్చు అంటూ పవన్ ఫ్యాన్స్ కామెంట్లు పెడుతున్నారు. అయితే ఓజీ ఫైర్ స్టోర్మ్ సాంగ్ క్రియేట్ చేసిన ఈ రికార్డుని సోనీ మ్యూజిక్ అఫీషియల్ గా బయట పెట్టింది.ఇదిలా ఉండగా.. ఎస్.ఎస్. తమన్ మ్యూజిక్ అందించిన ఈ ఫైర్ స్టార్మ్ ని రిలీజ్ చేశాక కొంతమంది యాంటీ ఫ్యాన్స్ కాపీ అంటూ కొన్ని కామెంట్లు వినిపించినప్పటికీ.. ఈ పాటకి మాత్రం మంచి ఆదరణ దక్కుతోంది.





# జోరు పెంచిన శ్రీలీల.. నిర్మాతల పాలిట వరం!

ప్రస్తుతం టాలీవుడ్ మోస్ట్ వాంటెడ్ బ్యూటీగా పేరు సొంతం చేసుకుంది శ్రీలీల. ఏడాదికి రెండు మూడు సినిమాల్లో కనిపిస్తూ ఇండస్ట్రీ మొత్తాన్ని ఒక ఊపు ఊపేస్తోంది. కేవలం సౌత్ ఇండస్ట్రీని మాత్రమే కాదు నార్త్ ఇండస్ట్రీని కూడా తన మాస్ ఎనర్జీతో కట్టిపడేస్తోంది. అయితే అలాంటి ఈ ముద్దుగుమ్మ ప్రస్తుతం బాలీవుడ్ తో పాటు సౌత్ ఇండస్ట్రీలో కూడా బిజీగా మారింది. అంతేకాదు ఒకవైపు హీరోయిన్‌గా చేస్తూనే.. అదే సినిమాలో స్పెషల్ సాంగులో కూడా చేస్తూ నిర్మాతలకు వరంలా మారిందని చెప్పవచ్చు. వాస్తవానికి చాలామంది నిర్మాతలు సినిమాలు తెరకెక్కించేటప్పుడు.. ఆ సినిమాలో మెయిన్ హీరోయిన్‌గా ఒకరిని తీసుకుంటే.. స్పెషల్ సాంగ్ కోసం మరో హీరోయిన్ ని తీసుకుంటారు. అయితే మెయిన్ హీరోయిన్‌గా చేసే హీరోయిన్‌కి ఎంత రెమ్యూనరేషన్ ఉంటుందో.. కేవలం 4,5 నిమిషాలు ఉండే స్పెషల్ సాంగ్ లో చేసే హీరోయిన్ కు కూడా అంతే రెమ్యూనరేషన్ ఉంటుంది. అయితే ఆ స్పెషల్ సాంగ్ లో కనిపించే హీరోయిన్ కోసం బాగా పాపులారిటీ ఉన్న వారిని.. యూత్లో మంచి క్రేజ్ ఉన్న వారిని మాత్రమే తీసుకుంటారు. పైగా స్పెషల్ సాంగ్స్ కోసం హీరోయిన్స్ ని రంగంలోకి దింపాలంటే దర్శక నిర్మాతలకు కత్తి మీద సాములాగ పరిస్థితి మారిపోయింది. కానీ శ్రీలీల హీరోయిన్ గా చేసే సినిమాల్లో మాత్రం అలాంటి హీరోయిన్ల అవసరమే ఉండదు. ఎందుకంటే శ్రీలీల అటు హీరోయిన్‌గా మెప్పించడమే కాదు. ఇటు ఐటెం సాంగ్‌తో కూడా అందరినీ ఒక ఊపు ఊపేస్తోంది. ఎందుకంటే ఇప్పటివరకు శ్రీలీల ఓవైపు సినిమాల్లో హీరోయిన్‌గా రాణిస్తూనే.. మరోవైపు స్పెషల్ సాంగ్స్ కూడా ఒకే చేస్తూ తన డ్యాన్స్‌తో ఆకట్టుకుంటోంది. అలా రవితేజ ధమాకా సినిమాలో పల్సర్ బండి, మహేష్ బాబు గుంటూరు కారంలో కుర్చీ మడతపెట్టి, కిరీటి రెడ్డి జూనియర్ మూవీలో వైరల్ వయ్యారి.. ఇలా ఈ మూడు సినిమాల్లో శ్రీలీల హీరోయిన్‌గా చేస్తూనే.. స్పెషల్ సాంగ్‌లో కూడా చేసి సెంటరాఫ్ అట్రాక్షన్ అయింది. ఇక శ్రీలీల సినిమాల్లో హీరోయిన్ గా ఉంటే స్పెషల్ సాంగ్‌ల కోసం డబ్బులు పెట్టి వేరే హీరోయిన్లను పెట్టుకోవాల్సిన పనిలేదు. శ్రీలీలనే రెండింటినీ కవర్ చేస్తుంది.

అలా ఓవైపు ఐటెం సాంగ్స్‌తో మెప్పిస్తూనే.. మరోవైపు హీరోయిన్ గా కూడా రాణిస్తోంది. ఒకరకంగా ఈ విషయంలో శ్రీలీల నిర్మాతలకు బంగారు బాతే అని చెప్పుకోవచ్చు. శ్రీ లీల ప్రస్తుతం రవితేజతో కలిసి మాస్ జాతర మూవీ చేస్తోంది.ఇప్పటికే ఈ సినిమా నుండి విడుదలైన తూ మేరీ లవర్, ఓలే ఓలే రెండు సాంగ్స్ కూడా హిట్ టాక్ తెచ్చుకున్నాయి. ఇందులో ఓవైపు మాస్ సాంగ్స్ తో కుర్రకారుని స్టెప్పులు వేయించడమే కాకుండా క్లాసీ లుక్స్ తో అదరగొట్టింది శ్రీలీల.



### ఆసియాకప్‌కు జట్టు

# ఎంపికపై సెలెక్టర్ల కసరత్తు షురూ

ఇంగ్లండ్ పర్యటనలో యువ క్రికెటర్లు అద్భుత ప్రదర్శన కనబర్చడంతో ఆసియాకప్‌కు జట్టు తలనొప్పిగా మారింది. ఇంగ్లండ్ నుంచి భారత ఆటగాళ్లంతా స్వదేశానికి తిరుగు ముఖం పట్టారు. శుభ్‌మన్ గిల్ నేతృత్వంలోని టీమిండియా అద్భుతంగా రాణించింది. దీంతో భారత జట్టు ఆసియా కప్‌కు ఎంపికపై ఉత్కంఠ నెలకొంది. సెప్టెంబర్ 9 నుంచి ఆసియా కప్ మొదలు కానుంది. ఈ టోర్నీ టి20 ఫార్మాట్‌లో జరగనున్న దృష్ట్యా జట్టును ఎంపిక చేసేందుకు సెలక్షన్ కమిటీకి పెద్ద సవాల్‌గా మారింది. టి20 జట్టు ఇటీవల కాలంలో నిలకడగా రాణిస్తోంది. ఈ ఫార్మాట్‌కు టీమిండియా కెప్టెన్‌గా సూర్యకుమార్ యాదవ్ వ్యవహరిస్తున్నాడు. ఆగస్టు మూడోవారంలోపు ఆసియా కప్ కోసం బిసిసిఐ జట్టును ప్రకటించాల్సి ఉంది. ఈ క్రమంలో జట్టులో చోటు కోసం జైస్వాల్, గిల్, సాయి సుదర్శన్ రేసులో ఉన్నారు. ఈ సిరీస్ ముగిసిన తర్వాత భారతజట్టు వెస్టిండీస్‌తో స్వదేశంలో జరిగే టెస్ట్ సిరీస్ ఆడాల్సి ఉంది. అక్టోబర్ 2 నుంచి అహ్మదాబాద్‌లో భారత్, వెస్టిండీస్ జట్ల మధ్య తొలి టెస్ట్ మ్యాచ్ జరగనుంది. ఐపిఎల్ చివరి సీజన్‌లో యశస్వి మంచి ఫామ్‌లో ఉన్నాడు. ఐపిఎల్‌లో జైస్వాల్ 160 స్ట్రయిక్ రేట్‌తో 559 పరుగులు, గిల్ 15మ్యాచుల్లో 650 పరుగులు చేశాడు. ఇక సాయి సుదర్శన్ 156 స్ట్రయిక్ రేట్‌తో 759 పరుగులు చేసి సీజన్-18 ఐపిఎల్ టాప్ స్కోరర్‌గా నిలిచాడు. ఈ క్రమంలో ఈ ముగ్గురికి ఆసియాకప్ జట్టులో చోటు కల్పిస్తారా? లేదా? అనే ఉత్కంఠ నెలకొంది. ఆసియా కప్‌లో ఆడే ప్లేయర్స్ అంతా ఫైనల్ వరకు 21 రోజులు అందుబాటులో ఉండాల్సి ఉంటుంది. ఆసియా కప్ కోసం 17మంది సభ్యులతో జట్టును ఎంపిక చేయనుండగా.. ప్రస్తుతం ఉన్న ఆప్షన్స్‌ను సెలెక్టర్లు జాగ్రత్తగా పరిశీలించన్నట్లు బిసిసిఐ అధికారి ఒకరు తెలిపారు. ఇక బౌలింగ్ విభాగం ఎంపిక కూడా సెలెక్టర్లకు ఇబ్బందికరంగా మారనుంది. కీలక టోర్నీకి ఫాస్ట్ బౌలర్లు జస్‌ప్రీత్ బుమ్రా, మహ్మద్ సిరాజ్‌ను ఎంపిక చేస్తారా? లేదా? అన్నది ఆసక్తికరంగా మారింది. ఆసియా కప్ తర్వాత వెంటనే వెస్టిండిస్‌తో సిరీస్ నేపథ్యంలో వీరి విషయంలో సెలెక్టర్లు జాగ్రత్తలు తీసుకునే అవకాశాలున్నాయి. అదే సమయంలో సెలక్షన్ కమిటీ సమావేశానికి ముందు ఫిట్‌నెస్‌ను సైతం అంచనా వేయాలని భావిస్తున్నట్లు సమాచారం. ఆసియాకప్-2025 యుఎఇ వేదికగా సెప్టెంబర్ 9నుంచి జరగనున్న సంగతి తెలిసిందే.






### ఐసిసి 'ప్లేయర్ ఆఫ్ ది మంత్'

# అవార్డుకు గిల్ నామినేట్

**దుబాయ్:** అంతర్జాతీయ క్రికెట్ కౌన్సిల్(ఐసిసి) 'ప్లేయర్ ఆఫ్ ది మంత్' అవార్డుకు భారత టెస్ట్ జట్టు కెప్టెన్ శుభ్‌మన్ గిల్ నామినేట్ అయ్యాడు. ఈ అవార్డు కోసం ఇంగ్లండ్ కెప్టెన్ బెన్ స్టోక్స్, దక్షిణాఫ్రికా స్టార్ ఆల్‌రౌండర్ వియాన్ ముల్డర్ కూడా పోటీలో ఉన్నారు. ఇంగ్లండ్‌తో ముగిసిన టెస్ట్ సిరీస్‌లో గిల్ బ్యాటింగ్‌లో పలు రికార్డులను నమోదు చేశాడు. గిల్ సారథ్యంలోని యువ భారత జట్టు సిరీస్‌ను 2-2తో డ్రా చేసింది. సిరీస్‌లో గిల్ 74.50 సగటుతో నాలుగు సెంచరీ సహాయంతో 754 పరుగులు చేశాడు. ఇందులో ఓ డబుల్ సెంచరీ కూడా ఉంది. ఈ క్రమంలో గిల్ కెప్టెన్‌గా ఒకే సిరీస్‌లో అత్యధిక పరుగులు చేసిన మాజీ కెప్టెన్ సునీల్ గవాస్కర్ (732 పరుగులు) రికార్డును బద్దలు కొట్టాడు. ఈ సందర్భంగా ఐసిసి గిల్‌ను ప్రశంసించింది. ఎడ్జ్‌బాస్టన్‌లో భారత్ సాధించిన రికార్డు విజయంలో గిల్ కీలక పాత్ర పోషించాడు. ఈ మ్యాచ్ తొలి ఇన్నింగ్స్‌లో 269 పరుగులు చేసిన గిల్.. రెండో ఇన్నింగ్స్‌లో 161 పరుగులు చేశాడు. ఈ మ్యాచ్‌లో మొత్తంగా 430 పరుగులు చేశాడు. ఒకే ఇన్నింగ్స్‌లో అత్యధిక పరుగులు చేసిన ఆటగాడిగా గ్రహం గూచ్ (456) నిలువగా.. ఆ తర్వాతి స్థానంలో శుభ్‌మన్ గిల్ రెండోస్థానంలో ఉన్నాడు. ఇక దక్షిణాఫ్రికా కెప్టెన్‌గా తన తొలి మ్యాచ్‌లో ముల్డర్ జింబాబ్వేతో జరిగిన టెస్ట్‌లో అజేయంగా 367 పరుగులు చేశాడు. 2004లో ఇంగ్లండ్‌పై బ్రియాన్ లారా చేసిన అత్యధిక వ్యక్తిగత స్కోర్ 400 (నాటౌట్) రికార్డును బ్రేక్ చేయలేదు.

ఈ రికార్డును బద్దలు కొట్టగలిగే దశలో ఉండగానే జట్టు ఇన్నింగ్స్‌ను ముల్డర్ డిక్లేర్ చేశాడు. రెండు మ్యాచుల్లో 265.50 సగటుతో 531 పరుగులు చేశాడు. ముల్డర్ బౌలింగ్‌లో నాలుగు వికెట్లు సహా 15.28 సగటుతో ఏడు వికెట్లు పడగొట్టాడని ఐసిసి పేర్కొంది. స్టోక్స్ ఆల్ రౌండ్ ప్రదర్శనను సైతం ఐసిసి ప్రశంసించింది. భారత్‌తో జరిగిన మ్యాచుల్లో 50.20 సగటుతో 251 పరుగులు చేశాడు. 26.33 సగటుతో 12 వికెట్లు పడగొట్టాడు. ఒత్తిడి పరిస్థితుల్లో సైతం స్టోక్స్ బ్యాట్, బంతి రెండింటితోనూ రాణించాడని ఐసిసి ప్రశంసించింది.

# చేనేత రంగాన్ని పూర్తి స్థాయిలో అభివృద్ధి చేస్తాం

**- చేనేత సోదరులకు సంపూర్ణ సహకారాన్ని అందిస్తాం**
**- జాతీయ చేనేత దినోత్సవ సభలో**
**మంత్రి సత్య కుమార్ యాదవ్, జిల్లా కలెక్టర్ చేతన్**



**శ్రీ సత్యసాయి బ్యూరో – సూర్య వాస్తవం, ఆగస్టు 7 :** వారసత్వ సంపదగా నిలిచిన చేనేత రంగాన్ని అభివృద్ధి చేయడమే ప్రభుత్వ ధ్యేయమని రాష్ట్ర ఆరోగ్య సంక్షేమ శాఖా మంత్రి సత్యకుమార్ యాదవ్, జిల్లా కలెక్టర్ టి.ఎస్.చేతన్ ..లు పేర్కొన్నారు. గురువారం కదిరి గేటు వద్ద ఉన్న నేతన్న విగ్రహం సమీపంలో 11వ జాతీయ చేనేత దినోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ కార్యక్రమానికి రాష్ట్ర ఆరోగ్య, సంక్షేమ శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్, జిల్లా కలెక్టర్ టి.ఎస్.చేతన్‌లు హాజరయ్యారు. ఈ సందర్భంగా మంత్రి సత్యకుమార్ యాదవ్ మాట్లాడుతూ...చేనేత కేవలం జీవనోపాధి మాత్రమే కాకుండా మన సంస్కృతికి, మన ప్రత్యేకతకు నిదర్శనమన్నారు. ఇటువంటి గొప్ప రంగాన్ని ప్రభుత్వం అన్ని విధాలా ఆదుకోవాలని ప్రభుత్వం సంకల్పించిందని చెప్పారు. గతంలో ఎప్పుడూ లేని విధంగా చేనేత రంగాన్ని కేంద్ర స్థాయిలో గుర్తించి, 2015, ఆగష్టు 7వ తేదీన చేనేత రంగాన్ని ప్రోత్సహించేందుకు ప్రతి సంవత్సరం జాతీయ చేనేత దినోత్సవంగా పాటించాలని పిలుపునిచ్చిన నేపథ్యంలో, ఈ రోజు 11వ జాతీయ చేనేత దినోత్సవాన్ని ఉత్సాహంగా నిర్వహించుకుంటున్నామన్నారు. రాష్ట్ర ప్రభుత్వం అనేక సంక్షేమాభివృద్ధి పథకాలను ప్రజలకు అందిస్తోందన్నారు. పెన్షన్లు, ఉచిత గ్యాస్ సిలిండర్లు, అన్న క్యాంటీన్లు వంటి పథకాలు ప్రజలకు నేరుగా లాభం చేకూర్చుతున్నాయని వివరించారు. చేనేత మగ్గాల కోసం 200 యూనిట్ల విద్యుత్‌ను ఉచితంగా అందించేందుకు కేబినెట్‌లో నిర్ణయం తీసుకున్నట్టు తెలిపారు. ప్రభుత్వం ప్రతి అర్హులైన చేనేత కుటుంబానికి నేరుగా రూ.25,000లు చెల్లిస్తుందని చెప్పారు. అలాగే జీఎస్టీ భారం నుంచి చేనేతలను విముక్తి చేయాలని నిర్ణయించి, 5 శాతం జీఎస్టీని రాష్ట్ర ప్రభుత్వం భరిస్తుందన్నారు.

రా మెటీరియల్ సప్లై స్కీమ్ కింద గత ఆర్థిక సంవత్సరంలో రూ.164 కోట్లు చెల్లించగా, అందులో రూ.25 కోట్లు రాష్ట్ర ప్రభుత్వం భరించినట్టు వెల్లడించారు. అలాగే మెగా హ్యాండ్లూమ్ క్లస్టర్‌ను ధర్మవరంలో ఏర్పాటు చేయాలని నిర్ణయించామన్నారు. ఈ క్రమంలో మార్కెట్ యార్డులో 10 ఎకరాల స్థలాన్ని గుర్తించి, త్వరలో భూమిపూజ నిర్వహించ నున్నట్టు తెలిపారు.ధర్మవరం పట్టణంలో నీటి సమస్యలు, అధిక లోడ్ సమస్యలపై చర్యలు తీసుకుంటూ, విద్యుత్ శాఖతో సంప్రదించి ప్రత్యేకంగా డిపిఆర్ సిద్ధం చేశారని.. రూ110 కోట్ల వ్యయంతో కొత్త విద్యుత్ ప్రాజెక్టుకు అనుమతి పొందే దిశగా కృషి జరుగుతోందన్నారు. ఇది పూర్తయితే ధర్మవరంలో మగ్గాలకు ఎటువంటి విద్యుత్ లోపం ఉండదన్నారు.వన్ డిస్ట్రిక్ట్ వన్ ప్రొడక్ట్ కింద ధర్మవరం చేనేతకు లభించిన కేంద్ర ప్రభుత్వం అవార్డు మన జిల్లాకు గర్వకారణమన్నారు. ప్రభుత్వం అందించే సహకారాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ధర్మవరం చేనేతను మరింత స్థాయిలో నిలబెట్టేందుకు ప్రభుత్వం అన్ని విధాలా అండగా ఉండబోతుందని తెలిపారు.

జిల్లా కలెక్టర్ టి.ఎస్.చేతన్ మాట్లాడుతూ... చేనేత కేవలం జీవనోపాధి కాదు, భారత సంస్కృతిని ప్రతిభింభించే ప్రతీక లాంటి వృత్తి అని పేర్కొన్నారు. దేశ ఆర్థిక వ్యవస్థలో వ్యవసాయ రంగం తర్వాత చేనేత రంగం అత్యధిక జనాభాకు ఉపాధి కల్పిస్తు దేశంలోని మొత్తం వస్త్ర ఉత్పత్తిలో 19శాతం భాగస్వామ్యం కలిగియున్నది. ప్రపంచం అన్ని రంగాల్లో వేగంగా మారుతున్న నేపథ్యంలో చేనేత రంగం కూడా సాంకేతిక విజ్ఞానాన్ని అందిపుచ్చుకుని ముందుకు సాగాల్సిన అవసరం ఉందన్నారు. తమ ఉత్పత్తులను అమ్ముకోవడానికి అనేక కష్టాలు పడే వారని, నేడు ఆన్‌లైన్ మార్కెట్లు, డిజిటల్ పోర్టల్స్, ప్రభుత్వ వేదికలు వంటి అవకాశాలు అందుబాటులోకి వచ్చాయి. ఈ మార్పులను అంగీకరించి, తరం నుండి తరం వరకు నైపుణ్యాన్ని కొనసాగించడమే కాకుండా, ఆదాయాన్ని పెంపొందించే దిశగా చేనేత కుటుంబాలు ఆలోచించాల్సిన అవసరం ఉందన్నారు.ప్రధాని నరేంద్ర మోదీ ప్రవేశపెట్టిన "వన్ డిస్ట్రిక్ట్ వన్ ప్రొడక్ట్" పథకం కింద శ్రీ సత్యసాయి జిల్లా తరపున ధర్మవరం చేనేతకు జాతీయ స్థాయిలో గుర్తింపు లభించడం గర్వకారణమని తెలిపారు. ఇది జిల్లాలోని ప్రతి చేనేత కార్మికునికి దక్కిన గౌరవంగా భావించాలన్నారు. జిల్లాలోని చేనేత కుటుంబాలకు అవసరమైన మద్దతును అందించేందుకు జిల్లా యంత్రాంగం కట్టుబడి ఉందన్నారు. ఉత్పత్తుల నాణ్యత, మార్కెటింగ్ సామర్థ్యం, ఆధునికీకరణ, శిక్షణ వంటి అంశాల్లో అవసరమైన సహాయాన్ని అందించేందుకు సంబంధిత శాఖలను సమన్వయం చేస్తామని కలెక్టర్ తెలిపారు. 11వ జాతీయ చేనేత దినోత్సవం సందర్భంగా "చేనేత డిజైనింగ్" నందు జాతీయ అవార్డ్ అందుకున్న జిల్లా చేనేత డిజైనర్ జే.నాగరాజు ను మంత్రి సత్యకుమార్ యాదవ్, జిల్లా కలెక్టర్ టి.ఎస్.చేతన్‌లు అభినందించారు. టిడిపి ధర్మవరం ఇంచార్జి పరిటాల శ్రీరామ్, జనసేన స్టేట్ జనరల్ సెక్రటరీ చిలకం మధుసూదన్ రెడ్డిలు నేతన్నల సంక్షేమా భివృద్ధికి ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలను వివరించారు.ఈ సందర్భంగా ఉత్తమ చేనేత కార్మికులైన కాంతమ్మ, ఆంజనేయులు, ఈశ్వరయ్య, రామకృష్ణ తదితరులను ఘనంగా వారు సన్మానించారు.కార్యక్రమానికి ముందుగా ముఖ్య అతిధులు నేతన్న విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.ఈ కార్యక్రమంలో ధర్మవరం టీడీపీ ఇన్‌చార్జి పరిటాల శ్రీరామ్, జనసేన స్టేట్ జనరల్ సెక్రటరీ చిలకం మధుసూదన్ రెడ్డి, చేనేత జౌళి శాఖ అడిషనల్ డైరెక్టర్ మురళి కృష్ణ, జాయింట్ డైరెక్టర్ కన్న బాబు, ఆర్డీవో మహేష్, మున్సిపల్ కమిషనర్ ప్రమోద్ కుమార్, తదితరులు పాల్గొన్నారు.



# చిత్రావతి నదీతీర ప్రాంతం సుందరీకరణ

**- సుందరీకరణకు జోయాలుకాస్ సంస్థ రూ.కోటి 20 లక్షలు వితరణ**
**- జిల్లా జాయింట్ కలెక్టర్ అభిషేక్ కుమార్**



**శ్రీ సత్య సాయి బ్యూరో – సూర్య వాస్తవం, ఆగస్టు 7 :** శ్రీసత్య సాయి శతజయంతి ఉత్సవాల సందర్భంగా చిత్రావతి నది తీర ప్రాంతం ను సుందరంగా తీర్చిదిద్దడం జరుగుతుందని జిల్లా జాయింట్ కలెక్టర్ అభిషేక్ కుమార్ అన్నారు.గురువారం స్థానిక చిత్రావతి నది తీర ప్రాంతంలో సుందరీకరణ చేపట్టుటకు శ్రీ సత్య సాయి ట్రస్ట్ చైర్మన్ రత్నాకర్, జిల్లా జాయింట్ కలెక్టర్ అభిషేక్ కుమార్, పుట్టపర్తి ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి, మాజీ మంత్రి పల్లె రఘునాథ్ రెడ్డి భూమి పూజ చేశారు.ఈ సందర్భంగా జిల్లా జాయింట్ కలెక్టర్ అభిషేక్ కుమార్ మాట్లాడుతూ శ్రీ సత్య సాయి శతజయంతి ఉత్సవాల సందర్భంగా పుట్టపర్తిలో పలు సుందరీకరణ పనులను చేపట్టడం జరుగుతుందని అందులో భాగంగా చిత్రావతి నది తీర ప్రాంతంలో సుందరీ కరణ పనులకు భూమి పూజ చేయడం జరిగిందని అన్నారు. చిత్రావతి నదీ తీర ప్రాంతంలో పార్కును, జిమ్మును, ఫౌంటెన్, పగోడా తదితరాలను ఏర్పాటు చేయడం జరుగుతుందని అన్నారు. ముఖ్యంగా జోయాలుకాస్ ఫౌండేషన్ వారు ఈ సుందరీకరణకు రూ.1 కోటి 20 లక్షలు వితరణ చేయడం అభినందనీయమని అన్నారు.పుట్టపర్తి ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి మాట్లాడుతూ శ్రీ సత్య సాయి జయంతి ఉత్సవాల సందర్భంగా జుయాలుకాస్ ఫౌండేషన్ రూ.1 కోటి 20 లక్షల వితరణ చేయడం అభినందనీయమని అన్నారు. చిత్రావతి నది తీర ప్రాంతంలో ఒక అందమైన పార్కును, జిమ్, పగోడాను ఏర్పాటు చేయడం జరుగుతుందని అన్నారు. ఈ సందర్భంగా భూమి పూజ చేయడం జరిగిందని రెండు నెలలలో పూర్తి అవుతుందని చెప్పారు. జోయాలుకాస్ ఫౌండేషన్ వారు ఇస్తున్న ఒక కానుకని చెప్పవచ్చునని అన్నారు. అడగంగానే జుయాలుకాస్ ఫౌండేషన్ వారు వితరణ చేయడం అభినందనీయమని వారికి అభినందనలు తెలిపారు. ఇలా మరిన్ని కార్యక్రమాల్లో జోయాలుకాస్ ఫౌండేషన్ వారు పాల్గొని సహాయ సహకార అలంబించాలని భవిష్యత్తులో అంచ లంచలుగా జుయాలుకాస్ ఫౌండేషన్ ఎదగాలని అన్నారు. మాజీ మంత్రి పల్లె రఘునాథ్ రెడ్డి మాట్లాడుతూ శ్రీ సత్య సాయి ఆశీస్సులు ప్రతి ఒక్కరికి అందాలని అదేవిధంగా చిత్రావతి నది తీర ప్రాంతంలో సుందరీ కరణకు రూ.1కోటి 20 లక్షలు వితరణ చేసిన జుయాలుకాస్ ఫౌండేషన్కు ఆశీస్సులు అందాలని ఈ సందర్భంగా ఆయన అన్నారు. సుందరీకరణలో భాగంగా చిత్రావతి నది తీర ప్రాంతంలో ఆహ్లాదకరమైన వాతావరణాన్ని ఏర్పాటు చేయడానికి సుందరమైన పార్కు, జిమ్ము, వాకింగ్ ట్రాక్, పగోడా తదితరాలను ఏర్పాటు చేయడం జరుగుతుందని, ఈ పని వచ్చే రెండు నెలల్లో పూర్తి అవుతుందని అన్నారు. జుయాలుకాస్ ఫౌండేషన్ వారికి ఈ సందర్భంగా ధన్యవాదాలు తెలిపారు. తొలుత శ్రీ సత్య సాయి ట్రస్ట్ చైర్మన్ రత్నాకర్, జాయింట్ కలెక్టర్ అభిషేక్ కుమార్, పుట్టపర్తి ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి, మాజీ మంత్రి పల్లె రఘునాథ్ రెడ్డి తదితరులు మీ పూజ చేశారు.ఈ కార్యక్రమంలో పుట్టపర్తి ఆర్డీవో సువర్ణ, ఇరిగేషన్ ఏఈ సుధాకర్ రాజు, ఏఈఈ జానకి బాయ్, టిడిపి నాయకులు ఆదినారాయణ, బాలాజీ, జుయాలుకాస్ ఫౌండేషన్ ప్రతినిధులు జోయో మ్యాథ్యూస్, గణేష్ తదితరులు పాల్గొన్నారు.

# వీరబల్లి కస్తూరిభా ప్రిన్సిపాల్‌ను సస్పెండ్ చేయాలి

**- ఏఐఎస్ఏ అన్నమయ్య జిల్లా ప్రధాన కార్యదర్శి తుమ్మల లవకుమార్**



**అన్నమయ్య బ్యూరో – సూర్య వాస్తవం, ఆగస్టు 7:** వీరబల్లి మండల పరిధిలో గల ప్రభుత్వ కస్తూరిబా గురుకుల పాఠశాల నందు విద్యార్థిని విద్యార్థులను పాఠశాల నాన్ టీచింగ్ స్టాఫ్ ను ,టీచింగ్ స్టాఫ్ ను బెదిరింపులకు గురి చేస్తూ వేధిస్తున్న ప్రిన్సిపల్ సాయి దివ్యను వెంటనే సస్పెండ్ చేయాలని ఆల్ ఇండియా స్టూడెంట్స్ అసోసియేషన్ అన్నమయ్య జిల్లా ప్రధాన కార్యదర్శి తుమ్మల లవకుమార్ ఎంఈఓ 1 వీరనాగయ్యకి వినతి పత్రం అందజేయడం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో ఇదే పాఠశాల నందు టీచింగ్ స్టాఫ్, నాట్ టీచింగ్ స్టాఫ్‌కి చెందిన వారి వ్యక్తి గత గొడవల వలన ఉద్దేశపూర్వకంగానే ఫుడ్ పాయిజన్ జరగడం జరిగింది.ఆ సమయంలో పదుల సంఖ్యలో విద్యార్థినిలు ఆసుపత్రి పాలు అవడం జరిగింది. ఇలా చేస్తున్న వారి పై చర్యలు తీసుకోవాలని విద్యార్థి సంఘంగా అనేక అనేకమార్లు అధికారులు దృష్టికి కూడా సమస్యను తీసుకుపోవడం జరిగిందన్నారు.ఇదే పాఠశాలలో పనిచేస్తున్న తెలుగు ఉపాధ్యాయురాలుని విధుల నుంచి తొలగించి వేరే పాఠశాలకి పంపిస్తామని కలెక్టర్ ఇచ్చిన ఉత్తర్వులలో ఉంద అన్నారు. పోనీ ఆమెకి మరోచోట ఎక్కడైనా ఉద్యోగం ఇచ్చారా అంటే అదీ లేదు, సస్పెండ్ చేయలేదు,ఉద్దేశపూర్వకంగానే తెలుగు టీచర్ శంకరమ్మ ఉద్యోగం ఇవ్వకుండా, జీతం లేకుండా చేసి, వారి కుటుంబం రోడ్డున పడే విధంగా, మానసిక వేదనకు గురి చేస్తున్నారనీ అన్నారు. పదవ తరగతి పబ్లిక్ పరీక్షల సమయంలో ఇదే పాఠశాల నందు చదివే విద్యార్థినికి సంబంధించి ప్రిన్సిపల్ నిర్లక్ష్యం కారణంగా హాల్ టికెట్‌లో పేరు తప్పుగా రావడం పెద్ద సమస్య కావడం జరిగింది. దీనిపైన విద్యార్థి సంఘంగా డీఈవోకి కంప్లైంట్ చేయడం జరిగిందన్నారు. ఎటువంటి ఆర్డర్స్ లేకుండా ఇదే పాఠశాలలో కొన్ని సంవత్సరాలుగా ఉద్యోగం చేస్తున్న వారిపై అధికారులు ఏం చర్యలు తీసుకున్నారు ? అపాయింట్మెంట్ ఆర్డర్ లేకుండా ఉద్యోగం ఏ విధంగా నిర్వహిస్తారు ? వారికి ఏ విధంగా ప్రిన్సిపాల్ సహకారం అందిస్తారనీ అన్నారు.ఇలా రకరకాలైన టువంటి సమస్యలతో ఆ పాఠశాలలో పనిచేసే నాట్ టీచింగ్, టీచింగ్ వారికి అనేక రకాల వ్యక్తిగత మనస్పర్ధల కారణంగా విద్యార్థిని విద్యార్థులు నలిగిపోతూ, మానసికంగా ఇబ్బందులు గురవుతున్నారు.

ఆ పాఠశాలలో పనిచేసే కొందరి పై శాఖ పర్యమైన చర్యలు తీసుకుంటే తప్ప ఆ పాఠశాల అభివృద్ధి కావడానికి అవకాశం ఉందన్నారు. ఇదే పాఠశాలలో పనిచేసే కొందరి పై అధికారుల దృష్టికి అనేకమార్లు తీసుకుపోయినప్పటికీ చర్యలు శూన్యం,సమస్యలను సృష్టించే వారిని కాపాడుతూ వస్తున్నది ఎవరు ? ఇన్ని సమస్యలు జరిగినప్పటికీ పాఠశాల ప్రిన్సిపల్‌పై చర్యలు ఎందుకు తీసుకోవడం లేదు అన్నారు. కావున ఇప్పటికైనా జిల్లా కలెక్టర్ స్పందించి బాధ్యులపై శాఖా పరమైన చర్యలు తీసుకుని ఆ పాఠశాల అభివృద్ధికి సహకరించాలని ఆలిండియా స్టూడెంట్స్ అసోసియేషన్ అన్నమయ్య జిల్లా కమిటీగా తెలియజేస్తున్నామన్నారు.

# తల్లిపాలే బిడ్డకు మొదటి టీకా

**- జాయింట్ కలెక్టర్ అభిషేక్ కుమార్**



**శ్రీ సత్యసాయి బ్యూరో – సూర్య వాస్తవం, ఆగస్టు 7 :** మీ బిడ్డలకు ఆరోగ్యకరమైన ఆనందకరమైన జీవితాన్ని అందించేందుకు తల్లిపాలే బిడ్డకు మొదటి టీకా అని జాయింట్ కలెక్టర్ అభిషేక్ కుమార్ అన్నారు.గురువారం మహి ళాభివృద్ధి, స్త్రీ శిశు సంక్షేమ శాఖ పిడి కె ప్రమీల ఆధ్వర్యంలో తల్లిపాలు వారోత్సవాలలో భాగంగా తల్లిపాల వారో త్సవాల ప్రాముఖ్యతను తెలియపరుస్తూ పుట్టపర్తిలోని సత్యమ్మ గుడి నుండి ఆర్టీసీ బస్టాండ్ వరకు ర్యాలీ నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా జాయింట్ కలెక్టర్ అభిషేక్ కుమార్, పుట్టపర్తి ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి పాల్గొని ర్యాలీని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆర్టీసీ బస్టాండ్ వద్ద మానవహారంగా ఏర్పడి తల్లిపాల ప్రాముఖ్యతను నినాదాలతో తెలియపరుస్తూ, ప్రతిజ్ఞ చేశారు.ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ అభిషేక్ కుమార్ మాట్లాడుతూ తల్లిపాలు బిడ్డకు ఒకే జీవనాధారమని తల్లి పాలకు సరిరావు మరే ఇతర పాలని కాబట్టి తల్లి పాలను ఏ విధిగా తక్కువగా చూడకుండా, బిడ్డలకు ఆరోగ్య కరమైన, ఆనందకరమైన జీవితాన్ని తల్లి పాలనే బిడ్డకు అందించాలని అన్నారు. పుట్టపర్తి ఎమ్మెల్యే పల్లె సింధురా రెడ్డి మాట్లాడుతూ తల్లి పాలకు ఎటువంటి ప్రత్యామ్నాయం లేదని, ప్రతి బిడ్డకు తల్లిపాలు అందేలా చేయడమే మన సంకల్పం అని అన్నారు. నవజాత శిశువు యొక్క మొదటి ఆహారమైన తల్లిపాలతో బిడ్డకు రోగ నిరోధక శక్తి, సంపూర్ణ పోషణ లభిస్తుందని అన్నారు. మొదటి ఆరు నెలలు తల్లిపాలు మాత్రమే శిశువుకు సంపూర్ణ ఆహారమని తల్లిపాలు శిశు వును న్యుమోనియా, అతిసార వ్యాధి వంటి ప్రమాదకరమైన వ్యాధులనుండి కాపాడుతుందని అన్నారు. తల్లిపాలు పిల్లల మేధస్సు ను మెరుగుపరచడంలో సహాయపడుతుందని చెప్పారు.ఈ కార్యక్రమంలో పుట్టపర్తి ఆర్డీవో కుమారి సువర్ణ,స్త్రీ శిశు సంక్షేమ శాఖ పిడి ప్రమీల, డిఎం అండ్ హెచ్ ఓ ఫిరోజ్ బేగం, జయంతి, పుట్టపర్తి గాయత్రి, మహేష్ సుధీర్ వర్మ డిస్టిక్ కో ఆర్డినేటర్, డిసిపియు సిబ్బంది, ఐసిడిఎస్ సూపర్వైజర్స్, పుట్టపర్తి హెల్త్ డిపార్ట్మెంట్ సిబ్బంది, అంగన్వాడి వర్కర్స్, మెప్మా సిబ్బంది, ఏఎన్ఎంలు, ఆశా వర్కర్స్, విజ్ఞాన్ నర్సింగ్ విద్యార్థులు పాల్గొన్నారు.

PRINTED AND PUBLISHED OWNED BY MOGAL IRSHAD BAIG, ON BEHALF OF IRS PUBLICATIONS , 13-2-819-2 RAMBOW RESIDENCE , RTC BUS STAND ROAD, SRINIVASA NAGAR, ANANTAPURAM, ANDHRAPRADESH-515001, VIJ. ADDRESS : SHEETAL APARTMENT, TF2 DR NO : 30-2-15/IE VIJAYAWADA-10, EDITOR : M.IRSHAD BAIG, CELL : 918500425222 ( ASSOCIATE EDITOR -N.ARIF ALI )